
రంజాన్ వేళలు | ఇఫ్తార్ (సోమ) సా.6.20 | సహరి (మంగళ) ఉ.4.53

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



తూర్పుగోదావరి

జిల్లా వార్తలు

సోమవారం 10 మార్చి 2025 | 5



అమ్మా..బాధపడకమ్మా!

కోతి జాతి నుంచి మానవుడు పుట్టాడనేది అక్షరసత్యం.. మనుషులు ఎంత తెలివిగా ఉంటారో కోతులు, కొండ ముచ్చులు కూడా అంతే తెలివిగా ఉంటాయి..కంగారు పెడితే మీదకొస్తాయ్..బాధలో ఉంటే ఓదారుస్తాయ్.. తాళ్లపూడి మండలం తాడిపూడిలో కెమెరాకు చిక్కిన ఈ ఘటనే ఇందుకు నిదర్శనం..ఇటీవల శివరాత్రి స్నానాలకు వెళ్లి తాడిపూడి వద్ద గోదావరిలో మునిగి మృతిచెందిన ఐదుగురు యువకుల చివరిరోజు కార్యక్రమాలు శనివారం నిర్వహించారు.అనిశెట్టి పవన్ కుమార్ తల్లి రజనీ కుమారుడి ఫొటో వంక చూస్తూ రోదిస్తుంది.. ఇంతలో ఒక కొండముచ్చు అటుగా వచ్చి బాధలో ఉన్న తల్లిని ఆమె కుమారుడు ఎలా నిమిరేవాడో అలాగే నిమిరి ఓదార్చింది.. కాసేపు ఆమె ఒడిలో వాలింది..అనంతరం ఆమె పక్కనే పడుకుని వెళ్లిపోయింది. ఇది చూసిన గ్రామస్తులు ఆమె కొడుకే వానరం రూపంలో వచ్చి ఓదార్చిందని అనుకుంటున్నారు. - తాళ్లపూడి



నేడు నరసన్న కల్యాణం

కోరుకొండ నరసన్న కల్యాణోత్సవాలు సోమవారం నుంచి అంగరంగ వైభవంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు.. ఆదివారం రాత్రి ఉత్సవాలకు అంకురార్పణ చేశారు..ఈ మేరకు స్వామిని ప్రత్యేకంగా అలంకరించారు. సోమవారం రథోత్సవం.. అనంతరం కల్యాణోత్సం చేస్తారు.. ఈ మేరకు ఆలయం వద్ద ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా సౌకర్యాలు కల్పించారు.. కోరుకొండ మొత్తం విద్యుద్దీపాలతో అలంకరణ చేశారు.. ఉత్సవాలు 15వ తేదీ వరకూ జరుగుతాయని ఆలయ పండితులు చెబుతున్నారు. - వివరాలు 7లో

హద్దు..దాటనివ్వదు!



బోటుకు బిగిస్తున్న యంత్రం

ట్రాన్స్‌పాండర్

సముద్రంలో మత్స్యకారుల రక్షణకో మిషన్

ప్రస్తుతం చాలా మంది తండేల్ సినిమా చూసే ఉంటారు.. ఆ సినిమాలో హీరో టీమ్ వేటకు వెళ్లి సముద్రంలో అనుకోకుండా పాకిస్థాన్ సరిహద్దుల్లోకి వెళ్లిపోతారు.. అక్కడ జైలులో మగ్గిపోతారు.. చివరకు హీరోయిన్ పోరాడి వారిని విడిపిస్తుంది.. ఇది రియల్ స్టోరీగా డైరెక్టర్ కథనం.. ఇది నిజమే..ఎందుకంటే సముద్రంలో సరిహద్దులు దాటితే ప్రమాదమే.. అటువంటి ప్రమాదాల నుంచి మత్స్యకారులను తప్పించ డానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ట్రాన్స్‌పాండర్ అనే యంత్రాన్ని బోట్లకు బిగిస్తున్నాయి.



(కాకినాడ, ఆంధ్రజ్యోతి)

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా నుంచి సముద్రంలో చేపల వేటకు వెళ్లే మత్స్యకారులు అనేక మంది పొరపాటున పొరుగు దేశాల్లోకి వెళ్లి జైలు పాలవుతున్నారు. తెలియకుండా చేసిన తప్పునకు ఏళ్లకు ఏళ్ల ఆయా దేశాల జైళ్లలో మగ్గుతున్నారు. ఇకపై మత్స్యకారులకు ఆ బాధలు తప్పనున్నాయి. సముద్రంలో వేటాడుతున్న బోటు పొరుగు దేశాల సరిహద్దుల్లో అడుగుపెట్టే ప్రమాదం ఉంటే కిలోమీటరు దూరంలో ఉండగానే ఒక యంత్రం హెచ్చరిస్తుంది. ఆ యంత్రాలను ఇప్పుడు ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో మత్స్యకారుల బోట్లకు అధికారులు బిగిస్తున్నారు. రూ.21 వేల విలువైన ఒక్కో యంత్రాన్ని మత్స్యశాఖ ఉచితంగా ఇస్తోంది.కేంద్రం,రాష్ట్ర ప్రభుత్వాలు ఉమ్మడిగా నిధులను భరించి మత్స్యకారులకు ఇస్తుండగా బిగింపు ముమ్మరమైంది.

- ఇక 'హద్దు'ల్లో ఉంచేస్తుంది
- బోట్లకు ట్రాన్స్‌పాండర్లు
- ఒక్కో మిషన్ ఖరీదు రూ.21 వేలు
- దేశ హద్దులు దాటకుండా అలెర్ట్
- కి.మీ దూరంలోనే హెచ్చరికలు
- వేటకు వెళ్లే మత్స్యకారులకు రక్షణ
- అప్రమత్తమై వచ్చేందుకు వీలు
- ఇతర దేశాల జైళ్లలో ఎంతో మంది

హద్దు దాటితే జైలే..

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో 67 వేల కుటుంబాలకు పైగా చేపల వేటపై ఆధారపడి జీవిస్తున్నాయి. ఇందులో 48 వేల కుటుంబాలు వరకు సముద్రంలో చేపల వేట ద్వారా బతుకు తున్నారు. వీరిలో అనేక మంది మత్స్యకారులు మెకనైజ్డ్ బోట్లపై వారాల తరబడి చెన్నై, ముం బై, గుజరాత్, ఒడిషా తదితర రాష్ట్రాల సముద్ర జలాల్లో ప్రయాణించి చేపల వేట సాగిస్తారు. ఈ క్రమంలో అనేక మంది మత్స్యకారులు తెలి యకుండా పాకిస్తాన్, బంగ్లాదేశ్, శ్రీలంక దేశాల సముద్ర జలాల్లోకి ప్రవేశిస్తున్నారు. దీంతో అక్కడ పోలీసులకు పట్టుబడి ఏళ్ల తరబడి ఆయా దేశాల జైళ్లలో మగ్గిపోతున్నారు.అటు వీరిని విడిపించడం సైతం కేంద్ర ప్రభుత్వానికి పెద్ద సవాల్‌గా మారిపోతోంది.2018 నవం బరు లో ఐ.పోలవరం మండలానికి చెందిన కొందరు మత్స్యకారులు పాకిస్తాన్ జలాల్లోకి వెళ్లి జైళ్లలో మగ్గిపోయారు. అనేక మంది మత్స్యకారులు ఈ తరహా సమస్యలు తరచూ ఎదుర్కొంటున్నారు.

తొలుత వాటికే..

కాకినాడ జిల్లాలో 76 కిలోమీటర్ల మేర సముద్రతీరం ఉంది. తీరం వెంబడి 23 ఫిష్ ల్యాండింగ్ సెంటర్ల ద్వారా 4,150 బోట్లు చేపల వేటకు అనుమతి పొందాయి. ఈ బోట్ల ద్వారా 36,112 మంది ఆధారపడి జీవిస్తున్నారు. వీటిలో తొలుత సుదీర్ఘతీరం సముద్రంలో వేటకు వెళ్లే మెకనైజ్డ్ బోట్లకు ఈ యంత్రాలను బిగిస్తున్నారు. తొలి విడత కింద ఉమ్మడి జిల్లాలో 1,600 బోట్లకు ఈ యంత్రాలను అమర్చాలని జిల్లా మత్స్యశాఖ లక్ష్యం విధించుకుంది. ఇందులో ఇప్పటి వరకు 350 బోట్లకు ట్రాన్స్‌పాండర్లు బిగించారు. మిగిలిన బోట్లకు బిగించే ప్రక్రియ కొనసాగుతోంది. మోటారైజ్డ్ బోట్లకు సైతం వీటిని బిగించాలని అధికారులు కసరత్తు చేస్తున్నారు. ట్రాన్స్‌పాండర్లు బిగించాలంటే సంబంధిత బోట్లలో బ్యాటరీలు నిరంతరం పనిచేస్తుండాలి. ప్రస్తుతం ఇవి ఉన్న బోట్లకే యంత్రాలు బిగిస్తున్నారు. అటు కోనసీమ జిల్లాలో 64 వరకు మెకనైజ్డ్ బోట్లు ఉన్నాయి.వీటికి కూడా బిగింపు ప్రక్రియ కొనసాగుతోంది. ప్రస్తుతం భైరవపాలెంలో ఉన్న బోట్లకు కోనసీమ జిల్లా మత్స్యశాఖ అధికారులు యంత్రాలను అమర్చేపనిలో ఉన్నారు. తూర్పుగోదావరి జిల్లాలో మెకనైజ్డ్ బోట్లు ఉన్నా సముద్రంలో వేటకు వెళ్లేవి తక్కువే.

బోట్లకు కుయ్..కుయ్

కేంద్రం మత్స్యకారుల భద్రతకు పీఎంఎం ఎస్‌వై పథకం కింద ట్రాన్స్‌పాండర్లను ప్రవేశ పెట్టింది. వీటిని సముద్రంలో వేటకు వెళ్లే బోట్లకు అమర్చుతోంది. ట్రాన్స్‌పాండర్లు ఉన్న బోట్లు పొరపాటున పొరుగుదేశాల సముద్ర జలాల్లోకి వెళ్లే ప్రమాదం ఉంటే కిలోమీటరు దూరం ఉండగానే హెచ్చరిస్తాయి. తద్వారా పొరుగు దేశాలకు చిక్కకోకుండా మత్స్యకారులు సురక్షితంగా ఉండేలా ఇవి కీలకపాత్ర పోషించనున్నాయి.ఒక్కో ట్రాన్స్ పాండర్ ధర రూ.21 వేలు.కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు ఉచితంగా ఇస్తున్నాయి.ప్రస్తుతం వీటి బిగింపు కాకినాడ, కోనసీమ జిల్లాల్లో ఊపందుకుంది. ట్రాన్స్‌పాండర్లు ఉన్న బోట్లను అటు రాష్ట్ర ప్రభుత్వం, ఇటు కేంద్ర ప్రభుత్వం తరచూ పర్యవేక్షించనున్నాయి. తద్వారా అంతర్జాతీయ సరిహద్దుల దగ్గరకు వెళ్లే ముప్పు ఉంటే హెచ్చరించడంతో పాటు సముద్రంలో తుఫాన్లు, ఇతర ఆపద ఏది ఎదురైనా కాపాడేందుకు సిద్ధంగా ఉంటాయి.ఒకసారి ట్రాన్స్‌పాండర్‌ను బోటుకు బిగించిన తర్వాత శాటిలైట్‌తో బోటు అనుసంధానం అయిపోతుంది. తద్వారా ఏ సమస్య వచ్చినా మత్స్యకారులకు ఇబ్బంది ఉండదు.ఇన్‌కాయిస్ (ఇండియన్ నేషనల్ సెంటర్ ఫర్ ఓషన్ ఇన్ఫర్మేషన్ సర్వీస్) ద్వారా సముద్రంలో చేపలు ఎక్కువ ఎక్కడ ఉన్నాయనే సమాచారం సైతం ఎస్ఎంఎస్‌ల ద్వారా ఇన్‌కాయిస్‌నుంచి మత్స్యకారులకు అందుతుంది.

నో ఛాన్స్!



- ఒక్కరినీ వరించని ఎమ్మెల్సీ పదవి
- ఉమ్మడి జిల్లా నేతల్లో నిరాశ
- ఆశావహులకు బుజ్జగింపులు
- వచ్చేసారి చూద్దామని హామీ

(రాజమహేంద్రవరం- ఆంధ్రజ్యోతి)

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలోని కూటమి నేతలకు నిరాశ ఎదురైంది.. ఎమ్మెల్యేల కోటాలో ఎమ్మెల్సీ పదవి ఆశించిన నేతల ఎదురుచూపులు ఫలించలేదు.. పదవి తప్ప కుండా వస్తుందని ఆశించిన నాయకులకు నిరాశే మిగిలింది. ముఖ్యంగా తెలుగుదేశం పార్టీ నుంచి ఎక్కువ మంది ఎమ్మెల్సీలు ఆశించారు. ఉమ్మడి జిల్లాలో ఒక రెండు ఎమ్మెల్సీలు లభిస్తాయని అంతా ఊహించినా లెక్కతప్పింది. అధిష్ఠానం ఒక్కటీ కేటాయించలేదు.

పలువురికి నిరాశే..

సార్వత్రిక ఎన్నికల్లో కూటమిలో సీట్ల సర్దుబాట్ల మధ్య కొందరికి టికెట్లు దక్కలేదు. అప్పుడు ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా పలువురు నేతలకు ఎమ్మెల్సీ కోటాలో చూద్దామని పార్టీ అధిష్ఠానం హామీ ఇచ్చింది.ఈ నేపథ్యంలో చాలా మంది ఎదురు చూశారు. కానీ రాష్ట్రంలో కేవలం ఐదు ఎమ్మెల్సీ స్థానాలు మాత్రమే ఖాళీ అవ్వడం వల్ల తెలుగుదేశం 3, జనసేన 1, బీజేపీ 1 కేటాయించారు. దీని వల్ల ఆశావహులకు అవకాశం రాలేదు. ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో పిఠాపురం మాజీ ఎమ్మెల్యే వర్మ,నిడదవోలు మాజీ ఎమ్మెల్యే బూరుగుపల్లి శేషారావుకు పదవి ఇస్తామని అధిష్ఠానం హామీ ఇచ్చింది. కొవ్వూరు మాజీ ఎమ్మెల్యే, మాజీ మంత్రి కెఎస్ జవహర్‌కు హామీ ఇచ్చినట్టు ప్రచారం జరిగింది. ఇక కోనసీమ నుంచి మాజీ ఎమ్మెల్సీ రెడ్డి సుబ్రహ్మణ్యం కూడా పదవి ఆశించారు.రాష్ట్రంలో ఎక్కువగా ఆశించే వారి సంఖ్య బాగా పెరడంతో అధిష్ఠానానికి ఇబ్బందికరంగా మారింది. సర్దుబాట్ల వల్ల పలువురు ఎమ్మెల్సీ ఆశలు నీరుగారిపోయాయి.ఈ మేరకు సీఎం చంద్రబాబు టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాస్‌తో మాట్లాడి తర్వాత ఎప్పుడు ఎమ్మెల్సీ ఖాళీ అయినా హామీ ఇచ్చిన వారికి ఇస్తామని చెప్పాలని ఆదేశించారు.ఈ నేపథ్యంలో టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు, గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాస్ ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలోని ఇద్దరు నేతలకు ఫోన్ చేసి పరిస్థితిని వివరించారు. 2027లో ఎక్కువ ఎమ్మెల్సీ స్థానాలు ఖాళీ అవుతాయని..అప్పుడు మీకు కచ్చితంగా స్థానం కల్పిస్తామని స్వయంగా సీఎం చంద్రబాబు చెప్పమన్నారని చెప్పడం గమనార్హం.

యనమలకు కీలక పదవి?

ప్రస్తుతం ఎమ్మెల్సీగా ఉన్న ఆర్థిక శాఖ మాజీ మంత్రి యనమల రామకృష్ణుడు పదవి కాలం ఈనెల 29తో ముగియనుంది. ఈసారి ఆయన ఎమ్మెల్సీని ఆశించినా దక్కలేదని సమాచారం. సీఎం చంద్రబాబుకు సన్నిహితుడు, టీడీపీలో కీలకనేతగా ఉన్న యనమలకు త్వరలోనే మరో కీలక పదవి రానున్నట్టు ప్రచారం జరుగుతోంది. రాజ్యసభ సభ్యత్వం వస్తుందని లేదా గవర్నర్ పదవి లభిస్తుందనే ప్రచారం ఉంది.తుని నియోజకవర్గం పరిధిలోని తేటగుంటలో హైవే సమీపంలో తోటలోని ఆయన ఇంటివద్ద ఇటీవల పెద్ద గేటు నిర్మిస్తుండడంతో పాటు, గేటు సమీపంలో బంకర్ కూడా ఏర్పాటు చేస్తున్నట్టు చెబుతున్నారు. ఈ నేపథ్యంలో ఏదో కీలక పదవి రాబోతుందనే ప్రచారం ఊపందుకుంది.



బలభద్రపురంలో విలేకరులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రామకృష్ణారెడ్డి

చెత్త ప్లాంట్ ఏర్పాటు చేస్తామంటే ఊరుకోం

- ఎక్కడో చెత్తను బలభద్రపురం తరలిస్తామంటే ఊరుకోం
- ఎంత వరకైనా పోరాడతాం
- అనపర్తి ఎమ్మెల్యే రామకృష్ణారెడ్డి

బిక్కవోలు, మార్చి 9 (ఆంధ్రజ్యోతి) : తూర్పుగోదావరి, కాకినాడ జిల్లాల్లో మున్సిపాలిటీల నుంచి వచ్చే చెత్తను తెచ్చి బలభద్రపురం, కాపవరం గ్రామాల వద్ద విద్యుదుత్పత్తి ప్లాంట్ పరిశ్రమ ఏర్పాటు చేస్తామంటే ఊరుకునేది లేదని అనపర్తి ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి అన్నారు. బిక్కవోలు మండలం బలభద్రపురంలో ఆదివారం విలేకరులతో మాట్లాడారు. మునిసిపల్ పట్టణాభివృద్ధి శాఖ మంత్రి నారాయణ శనివారం విద్యుదుత్పత్తి ప్లాంట్ స్థల పరిశీలన చేయడంపై ఆయన తీవ్రంగా స్పందించారు. మునిసిపాలిటీల చెత్తను ఇక్కడికి తీసుకువచ్చే ప్రతిపాదనలు ఎలా ఇచ్చారంటూ కలెక్టర్లను దుయ్యబట్టారు. ఈ ప్రతిపాదనను స్థానిక ప్రజలు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారన్నారు.ఎట్టి పరిస్థితుల్లోను ఈ ప్రతిపాదన ఆమోదించేది లేదన్నారు. గత వైసీపీ ప్రభుత్వ నిర్వాకంతో బలభద్రపురంలో ఏర్పాటు చేసిన గ్రాసీం పరిశ్రమ కారణంగా తీవ్ర కాలుష్యం వెదజల్లుతుందన్నారు. ప్రస్తుతం ఇక్కడ వందలాది ప్రజలు క్యాన్సర్ వ్యాధి బారిన పడుతుంటే ఇప్పుడు కూటమి ప్రభుత్వం చేస్తున్న నిర్వాకం ఇదా అంటూ ప్రశ్నించారు. కలెక్టర్లు ప్రతిపాదన పంపారా లేక పరిశీలన మాత్రమేనా అసలు ఈ ప్లాంట్ వ్యవహారం ఏ స్థాయిలో ఉందనేది స్పష్టం చేయాలని డిమాండ్ చేశారు. ఏ స్థాయిలో ఉన్నా స్థానిక ప్రజల అభిప్రాయం మేరకు మేము దీన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామన్నారు. ఈ ప్రతిపాదనను ఆపాలని సీఎం చంద్రబాబు, మునిసిపల్ శాఖ మంత్రి నారాయణ, డిప్యూటీ సీఎం పవన్, మంత్రి లోకేశ్ దృష్టికి తీసుకెళతానని తెలిపారు. ప్రజాభిప్రాయం తెలుసుకోకుండా ఎక్కడో ఉన్న చెత్తను ఇక్కడకు తరలిస్తామంటే ఊరుకోమన్నారు.అవసరమైతే ఏ స్థాయికైనా వెళ్లి పోరాడతామన్నారు.సమావేశంలో సర్పంచ్ బుంగా రామారావు,మాజీ ఎంపీటీసీ నల్లమిల్లి వెంకటసుబ్బారెడ్డి, ఎంపీటీసీ చిన్నం రాఘవ పాల్గొన్నారు.

సన్..డే!

జనం ఆపసోపాలు



రాజమహేంద్రవరం సిటీ, మార్చి 9 (ఆంధ్రజ్యోతి) : సన్..డే మంటలు.. జనం ఆపసోపాలు.. వేసవి ఆరంభంతోనే భానులు నిప్పులు కక్కుతున్నాడు. రాజమహేంద్రవరంలో ఆదివా రం ఎండ తీవ్రత పెరిగింది. దీంతో ప్రజలు ఎండవేడిమి నుంచి తట్టుకునేందుకు సమ్మర్ సేఫ్టీ వైపు పరుగులు తీస్తున్నారు. రాజమహేంద్రవరంలో ఆదివారం అత్యధికంగా 38 డిగ్రీలు ఉష్ణోగ్రత నమోదైంది. కనిష్ఠంగా 21.0 డిగ్రీలు నమోదైంది. దీంతో వాహనదారులు, బాటసారులు ఆపసోపాలు పడ్డారు. ముఖానికి మాస్కులు, తలకు టోపీలు ధరించారు. అధిక ఉష్ణం నుంచి ఉపశమనం కోసం చల్లనిపానీయాలతో సేదతీ రారు. ఆదివారం కావడంతో బయటకు వచ్చిన వాళ్ళు త్వరగా పనులు ముగించుకుని ఇళ్ళకు చేరుకున్నారు. మధ్యాహ్నం రోడ్లన్నీ ఖాళీగా దర్శనమిచ్చాయి. సోమవారం నుంచి ఎండల తీవ్రత మరింత పెరిగే అవకాశం ఉందని వాతావరణ శాఖ అధికారులు హెచ్చరిస్తున్నారు.

క్రికెట్ బెట్టింగ్ ముఠాపై పోలీసుల దాడి

20 మంది అరెస్టు?

రాజానగరం, మార్చి 9 (ఆంధ్రజ్యోతి) : క్రికెట్ బెట్టింగ్ ముఠాపై ఆదివారం రాత్రి పోలీసులు దాడి చేసినట్టు సమాచారం. ఛాంపియన్స్ ట్రోఫీ ఫైనల్స్ మ్యాచ్ ఇండియా న్యూజిలాండ్ మధ్య ఆదివారం రాత్రి హోరాహోరీగా జరిగింది.ఈ మ్యాచ్‌పై అంచనాలు పెరిగిపోయాయి. దీంతో బెట్టింగ్ రాయుళ్ల గల్లాపెట్టే తెరిచారు. రాజానగరం పోలీస్ స్టేషన్ పరిధిలోని బ్రిడ్జ్ కౌంటీలో భారీగా క్రికెట్ బెట్టింగ్ సాగుతుందన్న సమాచారంతో పోలీసులు దాడి చేసినట్టు తెలిసింది.దీనిలో భాగంగా 20 మంది బెట్టింగ్ రాయుళ్లతో పాటుగా భారీస్థాయిలో నగదు,కంప్యూటర్లు, ల్యాప్‌టాప్‌లు,సెల్‌ఫోన్లు పోలీసులు స్వాధీనం చేసుకున్నట్టుగా తెలిసింది.ఈ విషయమై పోలీసులు సరైన సమాచా రం ఇవ్వకుండా గోప్యంగా ఉంచుతున్నారనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.



ఓ ప్రైవేటు షాపులో ఏర్పాటు చేసిన సిట్టింగ్

నేడు బార్లు మూత?

రాజమహేంద్రవరం, మార్చి 9(ఆంధ్రజ్యోతి): బార్‌లు మూసేసి తాళాలు ఎక్సైజ్ అధికారులకు ఇచ్చేయాలని యజమానులు ఆలోచన చేస్తున్నారు.కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత 2024-26 మద్యం పాలసీని తీసుకొచ్చింది. ప్రైవేటు మద్యం షాపు లకు లైసెన్సు ఇచ్చింది.కూటమి ప్రభుత్వం కొత్త మద్యం పాలసీ తీసుకొచ్చే సమ యంలో బార్‌లు అక్టోబరు వరకూ లైసెన్సు ఫీజును చెల్లించాయి కాబట్టి ప్రైవేటు మద్యం షాపులకు ఆ సమయం వరకూ పర్మిట్ రూమ్‌లు వద్దని ఎక్సయిజ్ కమిషనర్‌కి విన్నవించగా సమ్మతించారు. అయితే ప్రస్తుత పరిస్థితి అందుకు విరుద్ధంగా ఉంది. ప్రైవేటు మద్యం షాపుల్లో అనధికారికంగా భారీ సిట్టింగ్‌లు ఏర్పాటు చేశారు. దీంతో బార్‌లు నష్టాల్లో చిక్కుకున్నాయి.ఈ విషయంలో ఎక్సైజ్ సూపరిం టెండెంట్‌కి ఆధారాలతో సహా ఎన్నిసార్లు విన్నవించినా ఎందుకనో ఫలితం లేదని బార్‌ల యజమానులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.ఈ నేపథ్యంలో బార్‌లకు సోమ వారం తాళాలు వేసేసి వాటిని ఎక్సైజ్ సూపరిం టెండెంట్‌కి ఇచ్చేద్దామని నిర్ణయం తీసుకున్నట్టు సమాచారం.మరోవైపు మంగళవారం విజయవాడ ఎక్సైజ్ సూపరింటెం డెంట్ కార్యాలయంలో సమావేశం ఉంది. దీనికి జిల్లా నుంచి ఎక్సైజ్ అధికారులు వెళ్లారు. సమావేశంలో తమకు అనుకూల నిర్ణయం తీసుకుంటారనే ఉద్దేశంతో సంయమనం పాటించాలని బార్‌ల యజమానులు అనుకుంటున్నట్టు తెలుస్తోంది. దీంతో నేడు ఎక్సైజ్ కమిషనర్‌తో జరిగే సమావేశం కీలకంగా మారనుంది.



కొవ్వూరు సంస్కృత పాఠశాల శివాలయంలో ఆదివారం గోష్పాదేశ్వరస్వామి ప్రత్యేక అలంకరణలో ఇలా భక్తులకు దర్శనమిచ్చారు.

అందపు అ(మ)ంచు!

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో పలుచోట్ల మంచు దుప్పటి పంట పొలాలు, జాతీయ రహదారి వెంబడి మార్గాలను కప్పేస్తోంది. ఆ అందమైన దృశ్యాలను ఆంధ్రజ్యోతి కెమెరా క్లిక్ మనిపించిందిలా..


ప్రత్తిపాడు హైవేపై..


రౌతులపూడిలో సూర్యోదయాన..


పిఠాపురంలో పొలాలపై..

కోరుకొండ నరసన్న కల్యాణోత్సవాలు ప్రారంభం



అంకురార్పణకు పుట్టమన్ను తవ్వుతున్న అర్చక స్వాములు, అంకురార్పణ చేస్తున్న దృశ్యం


విద్యుత్ కాంతుల్లో నరసింహస్వామి కొండ

కోరుకొండ, మార్చి 9(ఆంధ్రజ్యోతి): నవ నరసింహ క్షేత్రాల్లో ఒకటైన స్వయంభూ కోరుకొండ లక్ష్మీనరసింహస్వామి కల్యాణోత్సవాలు ఆదివారం రాత్రి ఆలయ ముఖ మండపంలో ఘనంగా ప్రారంభమయ్యాయి. అంతకుముందు మంగళ వాయిద్యాలు, మేళతాళాలతో శ్రీచక్ర పెరు మాళ్లను తీసుకుని దేవుడి కోనేటి వద్దకు వెళ్లి పుట్టకు శాస్త్రోక్తంగా పూజలు చేసి పుట్టమన్ను సేకరించారు. అనంతరం ఆలయం వద్ద అంకురార్పణ, ధ్వజారోహణ కార్యక్రమాలు పాణింగపల్లి పవన్కుమార్ ఆచార్యులు ఆధ్వర్యంలో అనువంశిక ధర్మకర్త పరాసర రంగరాజభట్టర్ పర్యవేక్షణలో నిర్వహించారు. వార్షిక బ్రహ్మోత్సవాలకు అన్నవరం దేవస్థానం అధికారులు పర్యవేక్షణలో వివిధ ప్రభుత్వ శాఖాధికారులు సమన్వయంతో ఏర్పాట్లు చేశారు. సోమవారం రథోత్సవం సందర్భంగా ఏ అవాంఛనీయ సంఘటనలు జరగకుండా డీఎస్పీ వైశ్రీకాంత్, సీఐ వై.సత్యకిషోర్ ఆధ్వర్యంలో పోలీస్ బందోబస్తు ఏర్పాట్లు చేశారు. ఈ మేరకు ఆలయం వద్ద పోలీస్ అవుట్పోస్టు ఏర్పాటు చేశారు. జాతరలో అవాంఛనీయ సంఘటనలు జరగకుండా కోరుకొండ మొత్తం సీసీ కెమెరాల పర్యవేక్షణలో ఉంచామని డీఎస్పీ తెలిపారు. స్వామివారి కల్యాణోత్సవాల నిర్వహణకు అన్నవరం దేవస్థానం ఈవో వీర్ల సుబ్బారావు, చైర్మన్ వైవీ రోహిత్, కోరుకొండ దేవస్థానం చైర్మన్ రంగరాజ భట్టర్, ప్రత్యేక సిబ్బంది తరలివచ్చారు. దేవదాయ, ధర్మదాయ శాఖ నుంచి ఉత్సవాలకు 250మంది సిబ్బందిని నియమించారు. దేవదాయ, ధర్మదాయ శాఖ నుంచి డిప్యూటేషన్పై మరికొంత మంది సిబ్బంది, అర్చకస్వాములు, వేద పండితులు వచ్చారు.

నేడు రథోత్సవం, కల్యాణం...

స్వామివారి రథోత్సవం సోమవారం మధ్యాహ్నం 1.56గంటలకు నిర్వహించనున్నారు. రథోత్సవానికి ముందు స్వామిని పెండ్లి కుమారుడు, అమ్మవారిని పెండ్లి కుమార్తెగా అలంకరించి ప్రత్యేక పల్లకిలో మంగళ వాయిద్యాలు, మేళతాళాల మధ్య తోడ్కొని వచ్చి రథంపై ఆసీనులను చేస్తారు. రథానికి ప్రత్యేక పూజలు చేసి వేలాదిమంది భక్తుల గోవింద నామస్మరణ మధ్య దేవస్థానం నుంచి రథోత్సవం బయలుదేరుతుంది. రాత్రి 9గంటలకు కల్యాణ మహోత్సవం వైభవంగా జరుగుతుంది. ఈ మేరకు స్వామి కల్యాణ మండపాన్ని విశేష పుష్ప అలంకరణలతో సిద్ధం చేశారు. రథోత్సవం అనంతరం ఎదుర్కోలు సన్నాహంతో నూతన వస్త్రాలు, సుగంధ ద్రవ్యాలు సమర్పించి మేళతాళాలతో స్వామి, అమ్మవార్లను రథం పై నుంచి ప్రత్యేక పల్లకీలో ఆలయానికి తోడ్కొని వస్తారు. రాత్రి 8గంటల సమయంలో మంగళస్నానం నిర్వహిస్తారు. వైఖానస ఆగమశాస్త్రం ప్రకారం స్వామి కల్యాణం రాత్రి 9 గంటలకు జరుగుతుంది.

సర్పవరంలో వైభవంగా
శ్రీరామచంద్రమూర్తి విగ్రహ ప్రతిష్ఠ

చిన్నజీయర్స్వామి చేతులమీదుగా నిర్వహణ


విగ్రహ ప్రతిష్ఠా మహాక్రతువులో పాల్గొన్న చిన్నజీయర్స్వామి


శ్రీసీతారాముల కల్యాణం దృశ్యం

సర్పవరం జంక్షన్, మార్చి 9 (ఆంధ్రజ్యోతి) : కాకినాడ జిల్లా సర్పవరంలో 160 ఏళ్ల క్రితం నిర్మించిన హనుమ, లక్ష్మణ సహిత శ్రీసీతారామ చంద్రస్వామి ఆలయ జీర్ణోద్ధరణ విగ్రహ ప్రతిష్ఠా మహోత్సవం ఆదివారం అశేష భక్తుల శ్రీరామ నామస్మరణ నడుమ అంగరంగ వైభవంగా జరిగింది. ఆలయ ధర్మకర్త పురాణం వెంకటాచార్యులు, వెంకటాచార్యులు, ధరణిధరచార్యుల ఆధ్వర్యంలో జరిగిన ఈ మహాకుంభ సంప్రోక్షణ మహాక్రతువులో త్రిదండి శ్రీమన్నారాయణ రామానుజ చిన్నజీయర్స్వామి పాల్గొన్నారు. స్వామివారికి ప్రాతఃఆరాధన, సేవాకాలం, చతుఃస్థానార్చన, తత్త్వన్యాస హోమం, గర్తన్యాసం, రత్నన్యాసం, యంత్ర స్థాపన, బింబ స్థాపన, శ్రీసుదర్శన పెరుమాళ్ల, నమ్మాళ్వార్, భగవద్ రామానుజాచార్యస్వామి తదితర పూజలు జరిపారు. విశేష పూజలు అనంతరం అశేష భక్తుల నడుమ విగ్రహమూర్తులకు చిన్నజీయర్ స్వామి స్వహస్తములతో పునర్వసు నక్షత్రయుక్త వృషభ లగ్న సముహూర్తంలో మహాకుంభ సంప్రోక్షణ, దృష్టికుంభ, మంగళద్రవ్య దర్శనం కావించారు. ఈ సందర్భంగా వేదపండితుల మంత్రోచ్చరణల నడుమ శాస్త్రోక్తంగా శ్రీసీతారాముల కల్యాణం నిర్వహించారు. విగ్రహ ప్రతిష్ఠా, ధ్వజ స్తంభం స్థాపనకు ముందు భక్తులను ఉద్దేశించి చిన్నజీయర్ స్వామి అనుగ్రహభాషా పారాయణం చేశారు. కార్యక్రమంలో సాతులూరి గోపాల కృష్ణమాచార్యస్వామి, త్రిదండి చిన్న రామ చంద్ర జీయర్స్వామి, గోవిందా జియ్యర్, త్రిదండి అహోబిల రామానుజజీయర్స్వామి పాల్గొన్నారు. అధిక సంఖ్యలో భక్తులు తరలిరాగా అన్నప్రసాద వితరణ చేశారు.

పెద్దిపాలెంలో రాష్ట్ర స్థాయి ఎడ్ల పరుగు పందాలు


పందెంలో పరుగు పెడుతున్న ఎద్దులు

ప్రత్తిపాడు, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా ప్రత్తిపాడు మండలం పెద్దిపాలెం గ్రామంలో ఆదివారం రాష్ట్రస్థాయి ఎడ్ల పరుగు పందాల పోటీలు నిర్వహించారు. సీనియర్స్ విభాగంలో ధర్మవరానికి చెందిన జువ్వల సత్తిబాబు ఎడ్ల జతకు ప్రథమ బహుమతి లభించింది. కాకినాడకు సమీపంలోని కొవ్వాడకు చెందినమట్టా నవనీత్ శ్రీమణికంఠ ఎడ్ల జతకు ద్వితీయ స్థానం, సామర్లకోట మండలం జి.మేడపాడుకు చెందిన మలిడ్డి అన్నపూర్ణ ఎడ్ల జతకు తృతీయస్థానం లభించాయి. అలాగే జూనియర్స్ విభాగంలో కోనసీమకు చెందిన కాపవరం కుంచం మనోజ్ ఎడ్ల జతకు ప్రథమ బహుమతి, రాజమండ్రి సమీపంలోని హుకుంపేటకు చెందిన కురమళ్ళ వీరవెంకటసత్య జయవర్ధన్ ఎడ్ల జతకు ద్వితీయ బహుమతి, కాకినాడకు సమీపంలోని కొవ్వాడకు చెందిన మట్టా నవనీత్ శ్రీమణికంఠ ఎడ్లజతకు తృతీయ బహుమతి లభించాయి. సీనియర్ విభాగంలో ప్రథమ, ద్వితీయ, తృతీయ విజేతలకు షీల్డ్లతో పాటు రూ.12వేలు, రూ.10వేలు, రూ.8 వేలు నగదును పెద్దిపాలెనికి చెందిన రెడ్డి పాపమ్మ, గ్రైపూరి శ్రీను, నలమాట రాజు అందజేశారు. జూనియర్స్ విభాగంలో ప్రథమ, ద్వితీయ, తృతీయ విజేతలకు రూ.10వేలు, రూ.8 వేలు, రూ.6వేలతో పాటు షీల్డ్లను పెద్దిపాలెనికి చెందిన కొల్లి శ్రీనివాస్, రాజమండ్రికి చెందిన ఆకుల రామకృష్ణ, శాంతి ఆశ్రమానికి చెందిన రోమాల నాగరాజు అందజేశారు. పోటీల్లో సీనియర్స్ విభాగంలో అనకాపల్లి, ఉమ్మడి తూర్పుగోదావరి, పశ్చిమగోదావరి జిల్లాల వ్యాప్తంగా 24ఎడ్ల జతలు పాల్గొన్నాయి. పోటీలకు న్యాయ నిర్ణేతలతుగా యనమల కృష్ణ, చేరుకూరి రామకృష్ణ, సిద్ద నానాజీ, కంటే ఫణికుమార్ వ్యవహరించారు.

టిప్పర్ ఢీ కొని యువకుడి మృతి


మృతిచెందిన నానిబాబు

నిడదవోలు, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): తూర్పు గోదావరి జిల్లా నిడదవోలు విద్యుత్ శాఖ డివిజనల్ కార్యాలయం సమీపంలో టిప్పర్ వ్యాన్ ఢీకొని ద్విచక్ర వాహనంపై ప్రయాణిస్తున్న యువకుడు సంఘటన స్థలంలోనే మృతిచెందాడు. మృతుడు నిడదవోలు మండలం పందలపర్రు గ్రామానికి చెందిన సంకు నాని బాబు(19)గా గుర్తించారు. నానిబాబుకు తల్లి సోదరీ మాత్రమే ఉండగా సోదరికి వివాహం జరిగిందని, తాపీ కార్మికుడిగా పనిచేసుకుంటూ తల్లి పోషిస్తున్నాడని స్థానికులు తెలిపారు. ఈ ఘటనపై పట్టణ ఎస్ఐ పరమహంస కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ప్రమాద సంఘటన జరిగిన వెంటనే వ్యాన్ డ్రైవర్ పోలీస్స్టేషన్లో లొంగిపోయినట్టు సమాచారం.

డివైడర్ను ఢీకొని జొన్నల్లంక యువకుడి మృతి


సాయివెంకట కృష్ణ (ఫైల్)

పి.గన్నవరం, మార్చి 9(ఆంధ్రజ్యోతి): ఉపాధి నిమిత్తం హైదరాబాద్ వెళ్లిన జొన్నల్లంక యువకుడు రోడ్డు ప్రమాదానికి గురై మృతిచెందాడు. స్థానికుల వివరాల ప్రకారం.. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా పి.గన్నవరం మండలం లంకగన్నవరం శివారు జొన్నల్లంక గ్రామానికి చెందిన సందాడి సాయివెంకటకృష్ణ(20), లంకే బాలమణికంఠలక్ష్మీసాయి ఉపాధి నిమిత్తం హైదరబాద్లో వెల్డింగ్ పనులు చేసుకుంటున్నారు. శనివారం రాత్రి 11 గంటల సమయంలో పని ముగించుకుని తమ రూమ్కు ద్విచక్రవాహనంపై తిరిగి వెళ్తుండగా వనస్థలిపురంలో ప్రమాదవశాత్తు డివైడర్ను బలంగా ఢీకొన్నారు. ఇద్దరిని ఉస్మానియా ఆసుపత్రికి తరలించారు. వెంకట కృష్ణ మృతిచెందగా,బాలమణికంఠ చికిత్స పొందుతున్నాడు.

ఆవిర్భావ సభకు మహిళలను ఆహ్వానించేందుకు
జనసేన వినూత్న కార్యక్రమం

బొట్టు పెట్టి పిలిచేలా ఆహ్వాన పత్రికను ఆవిష్కరించిన మంత్రి నాదెండ్ల


కాకినాడలో ఆహ్వాన పత్రికను ఆవిష్కరిస్తున్న మంత్రి నాదెండ్ల, ఎమ్మెల్యే పంతం నానాజీ

కలెక్టరేట్ (కాకినాడ), మార్చి 9 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా పిఠాపురం మండలం చిత్రాడ గ్రామంలో ఈనెల 14న నిర్వహించనున్న జనసేన ఆవిర్భావ సభకు మహిళలను ఆహ్వానించేందుకు వినూత్న కార్యక్రమానికి పార్టీ శ్రీకారం చుట్టిందని రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ పేర్కొన్నారు. ఇంటింటికి వెళ్లి బొట్టు పెట్టి ఆడపడుచులను ఆహ్వానించేలా ప్రత్యేకంగా రూపొందించిన బొట్టు స్టిక్కర్లతో కూడిన ఆహ్వాన పత్రికను ఆదివారం కాకినాడ కంట్రోల్ రూమ్లో ఆవిష్కరించారు. పార్టీ అధ్యక్షుడు, డిప్యూటీ సీఎం పవన్కల్యాణ్ తరుపున ఆడపడుచులకు ఇంటింటికి వెళ్లి బొట్టు పెట్టి సభకు ఆహ్వానించేలా పార్టీ వీరమహిళ విభాగానికి చొరవ తీసుకోవాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో శాసనమండలిలో ప్రభుత్వ విప్ పిడుగు హరి ప్రసాద్, కాకినాడ ఎంపీ తంగెళ్ల ఉదయ్ శ్రీనివాస్, కాకినాడ రూరల్ ఎమ్మెల్యే పంతం నానాజీ, మాజీ మంత్రి పడాల అరుణ, మాజీ ఎమ్మెల్యే పెండెం దొరబాబు, సివిల్ సప్లైస్ కార్పొరేషన్ చైర్మన్ తోట సుధీర్ ఉన్నారు.

గిరిజన విద్యార్థిని మృతదేహానికి
పోస్టుమార్టం జరగకుండా అడ్డగింత


ఏరియా ఆసుపత్రి ముందు ఆందోళన చేస్తున్న దృశ్యం

రంపచోడవరం, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): రంపచోడవరం మండలం వాడపల్లి ఆశ్రమ పాఠశాలలో ఆత్మహత్య చేసుకున్న గిరిజన విద్యార్థిని మృతదేహానికి ఆదివారం పోస్టుమార్టం జరగనీయకుండా సీఐటీయూ నాయకులు అడ్డుకున్నారు. పాఠశాల నిర్వహకులు సరైన పర్యవేక్షణ చేయకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించడమే సదరు విద్యార్థిని ఆత్మహత్యకు పాల్పడిందని సీఐటీయూ రాష్ట్ర నాయకురాలు మట్ల వాణిశ్రీ ఆరోపించారు. నాయకులు, వాడపల్లి గ్రామస్థులు, మృతురాలి బంధువులతో కలిసి రంపచోడవరం ఏరియా ఆసుపత్రి ముందు ఆందోళన చేపట్టారు. మృతురాలి కుటుంబానికి రూ.25 లక్షల పరిహారం చెల్లించాలని, బాధ్యులపై చర్యలు తీసుకోవాలని, ఇందుకు హామీ లభించే వరకూ పోస్టుమార్టం జరగనిచ్చేది లేదన్నారు. పోలీసులు, ఐటీడీఏ అధికారులు వచ్చి ఆందోళనకారులతో మాట్లాడినా ప్రయోజనం లేకపోయింది. కాగా ఉపాధ్యాయులు, సిబ్బంది కలిసి మృతురాలి కుటుంబానికి న్యాయం చేస్తామని, పరిహారాన్ని కూడా తమ వంతుగా అందజేస్తామని చర్చలు జరపడంతో ఆందోళన ముగిసింది. అనంతరం పోలీసుల పర్యవేక్షణలో పోస్టుమార్టం నిర్వహించి విద్యార్థిని మృతదేహాన్ని బంధువులకు అప్పగించారు.

స్వగ్రామంలో ఎమ్మెల్సీకి ఘన స్వాగతం


ఎమ్మెల్సీకి స్వాగతం పలుకుతున్న అభిమానులు

ఐ.పోలవరం, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): కోనసీమ జిల్లా ఐ.పోలవరం మండలం యానాం-ఎదుర్లంక బ్రిడ్జి వద్ద ఇటీవల పట్టభద్రుల ఎమ్మెల్సీగా ఎన్నికైన పేరాబత్తుల రాజశేఖర్కు ఆదివారం అభిమానులు ఘన స్వాగతం పలికారు. ఎమ్మెల్సీ హోదాలో తొలిసారి స్వగ్రామం జి.వేమవరం వచ్చిన ఆయనకు కూటమి నాయకులు, అభిమానులు మాజీ ఎమ్మెల్యే చెల్లి వివేకానంద ఆధ్వర్యంలో బాణసంచా కాల్చి స్వాగతం పలికారు. తొలుత ఆయన బ్రిడ్జి వద్ద అంబేడ్కర్, జీఎంసీ బాలయోగి విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. పాతయింజరం సెంటర్లో ఎదుర్లంక గ్రామస్తులు రాజశేఖర్ను గజమాలతో సత్కరించారు. అనంతరం ప్రచార రథంపై బైక్ ర్యాలీ నడుమ ఊరేగింపుతో స్వగ్రామం జి.వేమవరం చేరుకున్నారు. పాతయింజరం సెంటర్ నుంచి ఎదుర్లంక, గుత్తెనదీవి, జి.వేమవరం, జి.మూలపొలం వరకు ఈర్యాలీ జరిగింది.



మోరిని మెచ్చిన ముర్ము!

మోరి చీరను కొన్న రాష్ట్రపతి

అంతర్వేది, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): ఢిల్లీలోని రాష్ట్రపతి భవన్లో ఏర్పాటుచేసిన అమృత్ మహోత్సవ్ సౌత్ ఇండియాలో భాగంగా ఆంధ్రప్రదేశ్ తరఫున కోనసీమ జిల్లా మోరి చేనేత సంఘం ద్వారా ఏర్పాటు చేసిన స్టాల్లో రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము చేనేత చీరను కొనుగోలు చేశారు. రూ.1200 విలువగల ఈ చేనేత చీరను ఆమె కొనుగోలు చేసినట్టు మోరి చేనేత సొసైటీ మేనేజర్ అంకం రామలింగేశ్వరప్రసాద్ తెలిపారు. మోరి చీరల పనితనాన్ని ఆమె ప్రశంసించి నాణ్యతపై సంతృప్తి వ్యక్తంచేశారు.

హృదయాలను కదిలించిన అన్నదాత


అన్నదాత నాటకంలో ఓ సన్నివేశం

గొల్లప్రోలు రూరల్, మార్చి 9(ఆంధ్రజ్యోతి): పంటల సాగులో రైతులు ఎదుర్కొంటున్న కన్నీటి కష్టాలను, వారిని ప్రభుత్వాలు ఆదుకోవాల్సిన ఆవశ్యకతను వివరిస్తూ ప్రదర్శించిన అన్నదాత నాటకం అందరి హృదయాలను కదిలించింది. కాకినాడ జిల్లా గొల్లప్రోలు మండలం తాటిపర్తిలో అపర్ణా కళాతోరణం బత్తుల మురళీకృష్ణ కళావేదికపై అపర్ణా నాటక కళాపరిషత్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఉభయ తెలుగురాష్ట్రాల నాటకాల పోటీల్లో భాగంగా రెండోరోజు హైదరాబాద్కు చెందిన కళాంజలి కళాకారులు ప్రదర్శించిన అన్నదాత నాటకం ప్రేక్షకుల కంట తడి పెట్టించింది. వల్లూరి శివప్రసాద్ నాటికను రచించగా, కొల్లా రాధాకృష్ణ దర్శకత్వం వహించారు.

ఉమ్మడి కబడ్డీ జట్ల ఎంపిక

సామర్లకోట, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రస్థాయి కబడ్డీ క్రీడా పోటీలకు ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాల తరఫున పోటీ చేసేందుకు జూనియర్, సబ్ జూనియర్ కేటగిరిలలో బాలురు, బాలికల జట్ల క్రీడాకారులు ఎంపిక పోటీలు ఆదివారం కాకినాడ సామర్లకోట అయోధ్యరామపురం మున్సిపల్ ఉన్నత పాఠశాల ఆవరణలో నిర్వహించారు. జిల్లా కబడ్డీ అసోసియేషన్ కార్యదర్శి కొండపల్లి శ్రీనువాసు, ప్రో కబడ్డీ రిఫరీ బోగిళ్ళ మురళీకుమార్, డీవీశ్రీనివాసు, కోశాధికారి నిమ్మకాయల కిరణ్కుమార్ పర్యవేక్షణలో పోటీలు నిర్వహించి ప్రతిభ చాటినవారిని ఎంపిక చేశారు.

రేషన్ బియ్యం పట్టివేత

పెరవలి, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): పశ్చిమగోదావరి జిల్లా ఖండవల్లి జాతీయ రహదారిపై పది టన్నుల రేషన్ బియ్యాన్ని రెవెన్యూ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. తూర్పువిప్పర్రు నుంచి అంబేద్కర్ కోనసీమ జిల్లా రావులపాలెనికి ఫైషర్ వ్యాన్లో బియ్యాన్ని తరలిస్తున్నట్టు సమాచారం అందడంతో సివిల్ సప్లయ్, తహశీల్దార్ ఎస్ఎస్ సుధీర్రెడ్డి తెల్లవారుజామున ఖండవల్లి వద్ద జాతీయ రహదారిపై పట్టుకున్నారు. వాహనాన్ని స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశారు. డ్రైవర్ వైచర్ల శివ కిరణ్ను అదుపులోకి తీసుకుని వ్యాన్ను పెరవలి పోలీసులకు అప్పగించారు.

5 దశాబ్దాల బంధం.. అద్వితీయం!


గొల్లప్రోలు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో కలిసిన పదో తరగతి పూర్వ విద్యార్థులు

గొల్లప్రోలు, మార్చి 9(ఆంధ్రజ్యోతి): కలిసి చదువుకున్న వారంతా 5 దశాబ్దాల తర్వాత తిరిగి కలుసుకున్నారు. కాకినాడ జిల్లా గొల్లప్రోలు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1973-74బ్యాచ్కు చెందిన పదో తరగతి విద్యార్థులు ఆదివారం అదే పాఠశాల వేదికగా కలుసుకున్నారు. చిన్ననాటి జ్ఞాపకాలతో తడిచి ముద్దయ్యారు. పూర్వ విద్యార్థులు దంగేటి అప్పన్న, ఒంటిద్దు రామలింగం, కొసిరెడ్డి రామకృష్ణ, పేరాజు, నారాయణ, చక్కపల్లి ధర్మరాజు 3ఏళ్లగా కృషిచేసి అందరూ ఒకేచోట చేరేలాచేయడంలో సఫలీకృతులయ్యారు.

కాకినాడలో...

కాకినాడ రూరల్, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జగన్నాధపురంలోని ఎంఎస్ఎన్ ఛారిటీస్ డిగ్రీకళాశాల పూర్వవిద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం ఐడియల్ కళాశాల ఆవరణలోని సెమినార్హాల్లో ఆదివారం జరిగింది. కళాశాలలో బీకాం చదివిన మొదటి, రెండవ బ్యాచ్(1971-74, 1972-75) విద్యార్థులు సమావేశమై 50 వసంతాల సంబరాలను నిర్వహించుకున్నారు. ఉత్సాహంతో, కేరింతలతో ఆనాటి జ్ఞాపకాలను గుర్తుచేసుకున్నారు. ఆనాటి తమ గురువులైన ఎస్ఎం కొంపెల్ల, వీఎల్ గాంధీలను సత్కరించారు.



కాకినాడ ఎంఎస్ఎన్ ఛారిటీస్ డిగ్రీ కళాశాలలో కలిసిన పూర్వ విద్యార్థులు

రాజమహేంద్రవరం
• రాజమహేంద్రవరం సిటీ/ రూరల్ • రాజానగరం • అనపర్తి
ఆంధ్రజ్యోతి www.andhrajyothy.com

నేటికీ పునాదుల్లోనే..



» ధవళేశ్వరంలో నిలిచిపోయిన రైతు బజార్ నిర్మాణం
» 2022లో భూమిపూజ
» కూటమి ప్రభుత్వంలో అయినా పూర్తి చేయాలంటున్న గ్రామస్థులు

పునాది దశలో నిలిచిపోయిన రైతు బజార్ నిర్మాణం

ధవళేశ్వరం, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): రైతు బజార్ ధవళేశ్వరం వాసుల కల. ఆ కలను నిజం చేస్తూ 2022 సంవత్సరంలో అప్పటి వైసీపీ ఎంపీ మార్గాని భరత్‌రామ్ స్థానిక ప్రాథమిక వైద్యశాల పక్కన రైతు బజార్ నిర్మాణానికి భూమిపూజ చేశారు. సుమారు రూ.44 లక్షల అంచనా వ్యయంతో వైసీపీ నాయకుడికి పనులు అప్పగించారు. పనులు మొదలెట్టి పునాది, పిల్లర్ల నిర్మాణం వరకు వేగంగా పూర్తయ్యాయి. దీని కోసం కాంట్రాక్టర్ అవతారం ఎత్తిన వైసీపీ నాయకుడు సుమారు రూ.9లక్షల వరకు పెట్టుబడి పెట్టాడు. అటుపై రన్నింగ్ బిల్లు కోసం నాయకులు, అధికారులు చుట్టూ తిరిగి తిరిగి బిల్లు రాకపోవడంతో పనులు నిలిపివేశాడు. కొంత కాలం తరువాత సుమారు రూ.6 లక్షలు బిల్లు చెల్లించారు. తదుపరి ప్ర భుత్వం మారడం, టీడీపీ గవర్నమెంట్ నిర్ణయం ప్రకారం 25శాతానికి పైగా పూర్తికాని పనులను నిలిపివేస్తూ ఉత్తర్వులు ఇవ్వడంతో రైతుబజార్ పనులు నిలిచిపోయాయి. మేజర్ పంచాయతీగా ఉన్న ధవళేశ్వరం గ్రామంలో కూటమి ప్రభుత్వంలోనైనా రైతు బజార్ నిర్మాణం పూర్తి చేసి అందుబాటులోకి తీసుకురావాలని ప్రజలు కోరుతున్నారు.

చెడు అలవాట్లకు దూరంగా ఉండాలి

జేఎన్‌టీయూ ఇన్‌చార్జి వీసీ మురళీకృష్ణ



జేఎన్‌టీయూ ఇన్‌చార్జి వీసీ మురళీకృష్ణను సత్కరిస్తున్న దృశ్యం

రాజమహేంద్రవరం సిటీ, మార్చి 9(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు క్రమశిక్షణతో విద్యనభ్యసించాలని, చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని కాకినాడ జేఎన్‌టీయూ ఇన్‌చార్జి వీసీ మురళీకృష్ణ అన్నారు. స్థానిక బుచ్చయ్యనగర్‌లోని భాష్యం బ్లూమ్స్ క్యాంపస్‌లో ఆదివారం జరిగిన వార్షికోత్సవానికి ఆయన గౌరవ అతిథిగాను, భాష్యం అధినేత భాష్యం రామకృష్ణ తనయుడు ఎండీ సాకేత్‌రామ్ ముఖ్యఅతిథిగి విచ్చేశారు. ఈ సందర్భంగా మురళీకృష్ణ మాట్లాడుతూ విద్యార్థులు స్మోకింగ్, డ్రింకింగ్, డ్రగ్స్‌కు దూరంగా ఉండాలని అప్పుడు ఆరోగ్యంగా అభివృద్ధి చెంది కీర్తిమంతులవుతారని చెప్పారు. సాకేత్ రామ్ మాట్లాడుతూ విద్యార్థులు చదువుతోపాటు శారీరక, మానసిక ఎదగాలన్నారు. మరో ముఖ్యఅతిథి భాష్యం పూర్వ విద్యార్థి ఈఎక్స్‌ఎల్ ఎండీ వెంకట హనుమపుష్కర్ విచ్చేసి భాష్యంలో ఆయన అనుభవాలను పంచుకున్నారు. అనంతరం ముఖ్యఅతిథులను సత్కరించారు. కార్యక్రమంలో ఈస్ట్‌జోన్ ఇన్‌చార్జి ఆంజనేయులు, బ్లూమ్స్ జోనల్ వరలక్ష్మి, ప్రధానోపాధ్యాయులు, అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వాలు హామీలను అమలు చేయాలి

పీవోడబ్ల్యూ డివిజన్ నాయకురాలు ధనలక్ష్మి



సమావేశంలో మాట్లాడుతున్న డివిజన్ నాయకురాలు

కడియం, మార్చి 9(ఆంధ్రజ్యోతి): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మహిళలకు ఇచ్చిన ఎన్నికల హామీలు అమలు చేయాలని ప్రగతి శీల మహిళా సంఘం(పీవోడబ్ల్యూ) డివిజన్ నాయకురాలు పితాని ధనలక్ష్మి, షేక్ ఆశమునిషాబేగం డిమాండ్ చేశారు. దుళ్ల గ్రామంలో జరిగిన సభలో పలువురు మాట్లాడుతూ సమాజంలో సగ భాగంగా ఉన్న స్త్రీలను పాలకులు ఓటు బ్యాంకుగా చూస్తున్నారే తప్ప వారి హక్కులను కాలరాస్తున్నారన్నారు. మహిళలపై లైంగిక దాడులు అత్యాచారాలు పెరిగిపోయాయని ఆవేదన వ్యక్తంచేశారు. బేటీ బచావో.. బేటీ పడావో అంటూ మోదీ ఇచ్చిన నినాదం ప్రకటనలకే పరిమితమైందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన ఉచిత బస్సు, ప్రతి నెలా మహిళకు రూ.1500 నగదు పథకాల్ని అమలు చేయాలన్నారు. కార్యక్రమంలో సీపీఐ ఎంఎల్ న్యూడెమొక్రసీ జిల్లా సహాయ కార్యదర్శి చీకట్ల వేంకటేశ్వరరావు, అరుణోదయ రాష్ట్ర కార్యదర్శి వెంటపల్లి భీమశంకరం తదితరులు పాల్గొన్నారు.

మదనగోపాలస్వామి ఆలయంలో

ధ్వజస్తంభ ప్రతిష్ఠ

కడియం, మార్చి 9(ఆంధ్రజ్యోతి): మండలంలోని దుళ్లలో ప్రాచీనమైన రుక్మిణీ సత్యభామ సమేత శ్రీమదన గోపాలస్వామి ఆలయ ధ్వజస్తంభ ప్రతిష్ఠ ఆదివారం వైభవంగా జరిగింది. గ్రామానికి చెందిన తోకల వంశీయులు నిర్వహించిన ఈ కార్యక్రమం ఆలయ ప్రధానార్చకుడు ఖండవిల్లి రాధాకృష్ణమాచార్యులు ఆధ్వర్యంలో జరిగింది. సూక్త పారాయణ, హోమాలు, క్షీరాదివాసం, పంచశయ్యాధివాసం తదితర పూజా కార్యక్రమాలు జరిగాయి. పలువురు ప్రజాప్రతినిధులు, భక్తులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా భారీ అన్నసమారాధన ఏర్పాటు చేశారు.

వీరవరంలోని చేనేత కాలనీ సమీపంలో నూతనంగా నిర్మించిన శ్రీలక్ష్మీగణపతి నందీశ్వర స్వామి ఆలయంలో స్వాముల విగ్రహ ప్రతిష్ఠ సందర్భంగా పూజా కార్యక్రమాలు జరుగుతున్నాయి. మొదటిరోజు 108 కలశాలతో గ్రామోత్సవం జరిగింది. రెండోరోజు హోమాలు, పలు రకాల పూజలు జరిగాయి. సోమవారం లక్ష్మీగణపతి నందీశ్వర చౌడేశ్వరిదేవి విగ్రహ ప్రతిష్ఠ జరగనుంది.



దుళ్లలో పూజా కార్యక్రమాలు నిర్వహిస్తున్న తోకల వంశీయులు

టేబుల్ టెన్నిస్ విజేత త్రిషాల్‌కు సత్కారం



త్రిషాల్‌ను సత్కరిస్తున్న ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు

రాజమహేంద్రవరం కల్చరల్ మార్చి 9 (ఆంధ్రజ్యోతి): క్రీడాకారులు కష్టపడి ఆడి, రాజమహేంద్రవరానికి మంచి పేరు ప్రతిష్ఠలు తీసుకు రావాలని, అందుకు తగిన సహాయ సహకారాలు అందిస్తామని ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ అన్నారు. స్థానిక టౌన్ హాల్ వద్ద గౌతమి టేబుల్ టెన్నిస్ అకాడమీ హాల్లో అకాడమీకి చెందిన త్రిషాల్ రాజ్‌కుమార్ ఇటీవల ఇండోర్‌లో జరిగిన సబ్ జూనియర్ నేషనల్ చాంపియన్‌షిప్ టేబుల్ టెన్నిస్ పోటీల్లో డబుల్స్ విభాగంలో గోల్డ్ మెడల్, వ్యక్తిగత విభాగంలో బ్రాంజ్ మెడల్ సాధించాడు. దీంతో త్రిషాల్‌కు ఆదివారం సత్కార సభ ఏర్పాటు చేశారు. దీనికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ఎమ్మెల్యే మాట్లాడుతూ ఎంతో ప్రతిష్ఠాత్మకమైన టోర్నమెంట్లు రాజమహేంద్రవరంలో నిర్వహించడానికి కార్యాచరణ సిద్ధం చేస్తున్నామన్నారు. ఆకుల వీర్రాజు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో మద్దూరి శివ సుబ్బారావు.. త్రిషాల్‌కు నగదు బహుమతి అందజేశారు. టీటీ అసోసియేషన్ తరఫున కోచ్ వీటీవీ సుబ్బారావు, త్రిషాల్‌కు రూ.15 వేల చెక్‌ను బహుమతిగా అందజేశారు. కార్యక్రమంలో జె.వెంకటరెడ్డి, రెడ్డి రాజు, ఎ.బోస్, ఎం.బాబ్జీ, వీవీ సుబ్రహ్మణ్యం, కె.బుచ్చిరాజు, శైలజ, రాజ్యలక్ష్మి పాల్గొన్నారు.

రత్నాచల్ దిగి వస్తుండగా.. జన్మభూమి కొట్టేసింది

» రైలు ఢీకొని కాకినాడకు చెందిన వృద్ధుడి మృతి
» అనపర్తిలో పట్టాలు దాటుతుండగా ఘటన



మృతుడు ప్రభాకరరావు

అనపర్తి, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): తూర్పుగోదావరి జిల్లా అనపర్తి రైల్వే స్టేషన్‌లో ఆదివారం పట్టాలు దాటుతుండగా రైలు ఢీకొనడంతో ఓ వృద్ధుడు మృతి చెందాడు. జిల్లా కేంద్రం కాకినాడ పరిధిలోని ఇంద్రపాలెంకు చెందిన సింహాద్రి పభాకరరావు(70) ఆదివారం అనపర్తి రైల్వేస్టేషన్‌లో సామర్లకోట వైపు నుంచి వచ్చిన రత్నాచల్ ఎక్స్‌ప్రెస్ దిగి మొదటి ప్లాట్ ఫారమ్ ఎక్కుతుండగా రాజమహేంద్రవరం వైపు వెళుతున్న జన్మభూమి ఎక్స్‌ప్రెస్ ఢీకొట్టింది. దీంతో అక్కడికక్కడే మృతి చెందాడు. ప్రమాదం జరగడంతో.. అనపర్తిలో జన్మభూమి ఎక్స్‌ప్రెస్‌కు హాల్ట్ లేకపోయినప్పటికీ లోకో పైలెట్ 20 నిమిషాల పాటు రైలును నిలుపుదల చేసి సామర్లకోట రైల్వే పోలీసులకు సమాచారం అందించారు. మృతుడి సంచిలో లభించిన ఆధార్‌కార్డు ఆధారంగా బంధువులకు సమాచారం అందించినట్టు అనపర్తి రైల్వే పోలీసులు తెలిపారు.

నేడు కార్పొరేషన్‌లో పీజీఆర్ఎస్

రాజమహేంద్రవరం సిటీ, మార్చి 9(ఆంధ్రజ్యోతి):రాజమహేంద్రవరం కార్పొరేషన్ కార్యాలయంలో సోమవారం ఉదయం 10గం. నుంచి మధ్యాహ్నం 1గం. వరకు ప్రజాసమస్యల పరిష్కార వేదిక(పీజీఆర్ఎస్) నిర్వహిస్తున్నామని కమిషనర్ కేతన్‌గార్గ్ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ ఎత్తివేయడంతో పీజీఆర్ఎస్ నిర్వహిస్తున్నామని ప్రజలు వినియోగించుకోవాలని కోరారు.

ఎన్టీఆర్ స్ఫూర్తితో కూటమి పాలన

టీడీపీ వ్యవస్థాపకుడి విగ్రహ ఆవిష్కరణలో ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు



ఎన్టీఆర్ విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు

రాజమహేంద్రవరం సిటీ, మార్చి 9(ఆంధ్రజ్యోతి): సమాజమే దేవాలయం ప్రజలే దేవుళ్ల అని నినదించిన టీడీపీ వ్యవస్థాపకుడు ఎన్టీ రామారావు స్ఫూర్తితోనే కూటమి ప్రభుత్వం పనిచేస్తోందని ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ అన్నారు. ఆదివారం రాజమహేంద్రవరం 44వ డివిజన్‌లో తెలుగు యువత నాయకుడు వంజరపు శంకర్ ఏర్పాటు చేసిన ఎన్టీఆర్ విగ్రహాన్ని మాజీ ఎమ్మెల్సీ ఆదిరెడ్డి అప్పారావు, టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గన్ని కృష్ణలతో కలిసి ఎమ్మెల్యే ముఖ్యఅతిథిగా విచ్చేసి ఆవిష్కరించారు. ఆయనకు నివాళులర్పించారు. ఈ సందర్భంగా పేద మహిళలకు చీరలు పంచారు. అనంతరం ఆదిరెడ్డి వాసు మాట్లాడుతూ సంక్షేమ పథకాలకు ఆద్యుడు ఎన్టీఆర్ అని అన్నారు. ఆయన స్ఫూర్తితోనే సీఎం చంద్రబాబు పనిచేస్తున్నారన్నారు. కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీను ఒక్కొక్కటిగా నెరవేరుస్తోందన్నారు. మే నెల నుంచి తల్లికి వందనం ద్వారా పిల్లలకు రూ.15 వేలు అందజేస్తారని చెప్పారు. వైసీపీ నాయకుడు ఎన్నికల ముందు ఓట్ల కోసం హడావిడిగా పట్టాలు ఇచ్చి మోసం చేశాడని ధ్వజమెత్తారు. తాను మాత్రం త్వరలో కానవరంలోని స్థలంలో పది వేల పట్టాలకు చట్టబద్ధత కల్పించి ఇస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. సిటీ నియోజకవర్గంలో మహిళల స్వయం ఉపాధికి 801 కుట్టు మిషన్లు మంజూరయ్యాయని చెప్పారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కాశి నవీన్‌కుమార్, కంటిపూడి శ్రీనివాస్, పాలవలస వీరభద్రం, జవ్వాది విజయలక్ష్మి, పాలవలస బ్రహ్మాజీ పాల్గొన్నారు.

ఆదివారం సాయంత్రం బిలాల్ మసీదులో టీఎన్‌టీయూసీ జిల్లా మాజీ అధ్యక్షుడు నక్కా చిట్టిబాబు, తెలుగు యువత రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నక్కా దేవివరప్రసాద్ ఆధ్వర్యంలో జరిగిన ఇఫ్తార్ విందుకు ఎమ్మెల్యే వాసు ముఖ్యఅతిథిగా విచ్చేసి ముస్లింలతో కలిసి విందును స్వీకరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ 4వ డివిజన్‌లోని బిలాల్ మసీదు పునః నిర్మాణానికి రూ.లక్ష ఆర్థిక సాయం అందిస్తానన్నారు. కార్యక్రమంలో కుడుపూడి సత్తిబాబు, దొండపాటి సత్యంబాబు, ఆల్ సమీ గ్రూప్ ఆఫ్ కంపెనీస్ చైర్మన్ అబ్దుల్లా, జక్కంపూడి అర్జున్, బొమ్మనమైన శ్రీను పాల్గొన్నారు.

రాజ్యాధికారం దక్కకుండా చేసే కుట్రే వర్గీకరణ

» ఐక్యతతో పాలక పక్షాల కుట్రను తిప్పికొట్టాలి
» ఎస్సీ ఉద్యోగులు ఆత్మీయ సదస్సులో పీఎస్ఎన్ మూర్తి



ఐక్యత చాటుతున్న మాల ఉద్యోగులు

రాజమహేంద్రవరం సిటీ, మార్చి 9(ఆంధ్రజ్యోతి): దళిత, బహుజన వర్గాలకు రాజ్యాధికారం దక్కకుండా చేసే కుట్రే ఎస్సీ వర్గీకరణ అని మాలమహానాడు వ్యవస్థాపక అధ్యక్షుడు పీవీ రావు సోదరుడు మాజీ ఐడీఏఎస్ అధికారి పీఎస్ఎన్ మూర్తి అన్నారు. రాజమహేంద్రవరం ఆనం రోటరీ హాలులో శనివారం రాత్రి ఆంధ్రప్రదేశ్ మాల ఉద్యోగుల సంఘం ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా ఆత్మీయ సదస్సు జరిగింది. జిల్లా అధ్యక్షుడు ఎల్‌వీ ప్రసాదరావు అధ్యక్షతన జరిగిన ఈ సదస్సుకు ముఖ్యఅతిథిగా విచ్చేసిన మూర్తి మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణను మాలమాదిగల మధ్య సమస్యగానే చూడొద్దన్నారు. రాష్ట్రంలో పాలకులుగా ఉన్న రెడ్డి, కమ్మ కులాలు బహుజనులకు రాజ్యాధికారాన్ని దూరం చేయడానికి పన్నిన పన్నాగమే ఈ వర్గీకరణ అని అన్నారు. ఎస్సీ వర్గీకరణ సామాజిక వెనుకబాటుతనంతో ఇచ్చేది కాదని అంటరానితనం ప్రాతిపదికన కల్పించబడేదన్నారు. వర్గీకరణ అంశాన్ని చాలా లోతుగా అధ్యయనం చేసి అవగాహనతో పోరాటం చేసినప్పుడే పాలకుల కుట్ర ఎదుర్కోగలమన్నారు. కార్యక్రమంలో అఖిల భారత మాల జేఏసీ చైర్మన్ ఉప్పులేటి దేవిప్రసాద్, భారీయ బౌద్ధ మహాసభ సమతా సైనిక దళ్ రాష్ట్ర అధ్యక్షుడు బేతాల సుదర్శనం, ఏపీ మాల ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు నూతలపాటి జగదీష్, ఆంధ్రా యూనివర్శిటీ ప్రొఫెసర్ ఎస్‌పీడీ పాల్, ఎంపీఈపీడీసీఎల్ జనరల్ సెక్రటరీ చొప్పల సాయిబాబా, మాల ఉద్యోగుల సంఘం జిల్లా కన్వీనర్ గొల్లపల్లి కెనడి తదితర నాయకులు పాల్గొని మాట్లాడారు.

జనసేన ఆవిర్భావ సభను విజయవంతం చేయాలి

అనపర్తి, పిఠాపురం ఇన్‌చార్జి మర్రెడ్డి



అనపర్తి సమావేశంలో మాట్లాడుతున్న మర్రెడ్డి శ్రీనివాసరావు

అనపర్తి, మార్చి 9(ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా పిఠాపురం పరిధిలోని చిత్రాడలో ఈనెల 14న జరిగే జనసేన ఆవిర్భావ సభను విజయవంతం చేసేందుకు ప్రతి జనసైనికుడు, వీరమహిళ కృషి చేయాలని పార్టీ అనపర్తి, పిఠాపురం నియోజకవర్గాల ఇన్‌చార్జి మర్రెడ్డి శ్రీనివాసరావు పిలుపునిచ్చారు. ఆదివారం అనపర్తిలోని ఎస్ఎన్ఆర్ కల్యాణ మండపంలో బిక్కవోలు మండలాధ్యక్షుడు వీరబాబు అధ్యక్షతన జరిగిన సన్నాహక సమావేశంలో మర్రెడ్డి మాట్లాడారు. కూటమి ఏర్పాటుకు పవన్‌కళ్యాణ్ చేసిన కృషి ఫలితంగానే నేటి అధికారమని అన్నారు. అధికారం చేపట్టిన తరువాత మొట్టమొదటిగా జరిగే ఆవిర్భావ సభ విజయవంతం చేయాలన్నారు. నిస్వార్థంగా రాజకీయాల్లోకి వచ్చిన పవన్‌కల్యాణ్‌కు వీరాభిమానులు ఉన్నారని గ్రామాల్లో సభకు వచ్చే అవకాశం లేక రావాలని ఆశపడుతున్న వారికి ప్రయాణ సౌకర్యం ఏర్పాటు చేయాలన్నారు. సమావేశంలో కూటమి నాయకులు రావాడ నాగు, వై.శ్రీనివాస్, మహేష్, ఉషాకిరణ్, విజయ, వీరబాబుతోపాటు నియోజకవర్గంలోని నాలుగు మండలాల జనసేన అధ్యక్షులు, జనసైనికులు, వీర మహిళలు పాల్గొన్నారు.

రాజమహేంద్రవరం రూరల్: మండలంలోని హుకుంపేటలో జనసేన పార్టీ కార్యాలయంలో ఆదివారం ఈ నెల 14న చిత్రాడలో జరిగే జనసేన పార్టీ ఆవిర్భావ సభ సన్నాహక సమావేశం జరిగింది. దీనికి చీరాల నియోజకవర్గ ఇన్‌చార్జి ఆళ్ల అనిల్‌కుమార్ పొన్నూరు ఇన్‌చార్జి పార్వతీనాయుడు విచ్చేసి రాజమహేంద్రవరం రూరల్ నియోజకవర్గ నాయకులతో మాట్లాడారు. ఆవిర్భావ సభకు సన్నాహక ఏర్పాట్లు, కార్యాచరణ ప్రణాళికపై చర్చించారు. అనంతరరం పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో పలువురు నాయకులు పాల్గొన్నారు.



హుకుంపేట సమావేశంలో మాట్లాడుతున్న ఆళ్ల అనిల్‌కుమార్

క్వారీ సెంటర్‌లో

చలివేంద్రం ఏర్పాటు

రాజమహేంద్రవరం సిటీ, మార్చి 9(ఆంధ్రజ్యోతి): రాజమహేంద్రవరం క్వారీ సెంటర్‌లో ఏర్పాటు చేశారు. స్థానిక క్వారీ సెంటర్‌లో 45,46,47,48,49,50 డివిజన్లకు చెందిన ఎస్సీ నాయకుల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ చలివేంద్రాన్ని జనసేన నగర ఇన్‌చార్జి అనుశ్రీ సత్యనారాయణ ముఖ్య అతిథిగా విచ్చేసి ప్రారంభించారు. వేసవిలో బాటసారుల దహార్తి తీర్చడంలో చలివేంద్రాలు ఉపయోగపడతాయన్నారు. కార్యక్రమంలో జనసేన నగర కార్యదర్శి షాలిని, ఠాగూర్, విక్టరీ వాసు, తలారి శ్రీను, నర్సిపూడి రాంబాబు, బొట్ట మహేష్, మసానని, ప్రసాద్, మంచు ప్రవీణ్ పాల్గొన్నారు.

సమష్టి కృషితో

చోరీల నియంత్రణ: సీఐ

రాజానగరం, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): చోరీలు, నేరాలు నియంత్రణలో ప్రజల భాగస్వామ్యం అవసరమని సీఐ ప్రసన్న వీరయ్యగౌడ్ అన్నారు. ఇటీవల పెరుగు తున్న చోరీల దృష్ట్యా స్థానికులతో పాటు దుకాణదారులు, వ్యాపారవేత్తలకు చోరీల నియంత్రణపై ఆదివారం అవగాహన కల్పించారు. నేరాలు, దొంగతనాలను అరికట్టేందుకు ప్రజల భాగస్వామ్యం అవసరమన్నారు. అపరిచిత వ్యక్తులతో అప్రమత్తంగా ఉంటూ అనుమానితుల కదలికపై సమాచారం అందించాలన్నారు. అలాగే ప్రధాన కూడళ్లలోని వ్యాపారులంతా కలిసి సీసీ కెమెరాలను అమర్చుకుంటే కొంతవరకు అరికట్టవచ్చన్నారు. ప్రస్తుతం జరుగుతున్న దొంగతనాలకు సంబంధించి దొంగలు/ నేరస్థులను పట్టుకోవడంలో సరైన ఆధారాలు లభించకపోవడంతో జాప్యం జరుగుతోందని, దుకాణదారులు, వ్యాపార, వాణిజ్య సంస్థల యజమానులంతా తమ ప్రాంతాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకుని పోలీసులకు సహకరించాలని సీఐ విజ్ఞప్తి చేశారు.

వ్యాసరచన పోటీల్లో

‘జ్ఞాన’ విద్యార్థుల ప్రతిభ



విద్యార్థినులను అభినందిస్తున్న డీఎస్పీ శ్రీకాంత్

గోకవరం, మార్చి 9(ఆంధ్రజ్యోతి): ప్రపంచ మహిళా దినోత్సవం సందర్భంగా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో గోకవరంలోని జ్ఞాన సరస్వతి విద్యానికేతన్ విద్యార్థినులు ప్రతిభ కనబరిచారు. పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న పి.త్రిపుర, ఎ.ఇందిర వ్యాసరచన పోటీల్లో ప్రథమ, ద్వితీయ స్థానాల్లో నిలిచి బహుమతులు అందుకున్నారు. ఈ సందర్భంగా విద్యార్థినులిద్దరినీ ఆదివారం నార్త్‌జోన్ డీఎస్పీ శ్రీకాంత్ అభినందించారు. కార్యక్రమంలో పాఠశాల చైర్మన్ కంచర్ల సూర్యప్రకాష్, ఫౌండర్, డైరెక్టర్ బొడ్డేటి సురేష్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అభివృద్ధి, సంక్షేమ పథకాలే ప్రభుత్వ లక్ష్యం

ఎమ్మెల్యే రామకృష్ణారెడ్డి



రామవరంలో శిలాఫలకం ఆవిష్కరించిన ఎమ్మెల్యే నల్లమిల్లి

అనపర్తి, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): అభివృద్ధి, సంక్షేమ పథకాలే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తుందని ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి అన్నారు. ఆదివారం మండలంలోని రామవరంలో నిర్మించిన మూడు సీసీ రోడ్లను ప్రారంభించి, రిటర్నింగ్ వాల్ పనులకు ఎమ్మెల్యే భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల అభివృద్ధిలో భాగంగా నియోజకవర్గంలోని అనేక రహదారుల నిర్మాణాలను కోట్లాది రూపాయలు వెచ్చిస్తున్నామన్నారు. ఇటీవల నియోజకవర్గంలో మరిన్ని సీసీ రోడ్ల నిర్మాణాలకు సుమారు రూ14 కోట్ల నిధులు మంజూరు చేశామన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ గిరిడా గంగా భవాని, కుతులుకూరు సర్పంచ్ గొల్లు హేమతులసి, కర్రి శేషారత్నం, పడాల వెంకటరామారెడ్డి, తేనెల శ్రీనివాస్, చింతా సురేష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కొంకుదురులో యుద్ధాలమ్మ ఆలయ వార్షికోత్సవం



అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు

బిక్కవోలు, మార్చి 9(ఆంధ్రజ్యోతి): కొంకుదురు చింతాలమ్మ రోడ్డులో పొలాల మధ్య వున్న శ్రీయుద్ధాలమ్మ ఆలయ వార్షికోత్సవం ఆదివారం ఘనంగా జరిగింది. అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకుని మొక్కుబడులు చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా భక్తులకు ఆలయ కమిటీ సభ్యులు అన్న ప్రసాదాన్ని ఏర్పాటు చేశారు.

శివకుమార్‌కు ఉత్తమ నావికా వెటరన్ అవార్డు

సీతానగరం, మార్చి 9(ఆంధ్రజ్యోతి): మండలంలోని వంగలపూడి గ్రామానికి చెందిన నేవీ నావికుడు సూరెడ్డి శివకుమార్ ఒరిస్సాలోని ఐఎన్ఎస్ చిల్కాలోని అగ్నివీర్ పాసింగ్ ఔట్ పరేడ్‌లో సదరన్ నేవెల్ కమాండ్ ఫ్లాగ్ ఆఫీసర్ కమాండెంట్ ఇన్ చీఫ్ వైస్ ఎడ్మిరల్ వి.శ్రీనివాస్ చేతుల మీదుగా ఉత్తమ నావికా వెటరన్ అవార్డును ఈ నెల 7న అందుకున్నారు. సౌత్ ఇండియలో ఈ గొప్ప గౌరవ అవార్డు పొందిన మొట్టమొదటి నేవీ సైలర్‌గా శివకుమార్ నిలిచారు. ఈయన 1986 జనవరి 4న ఇండియన్ నేవీలో ఉద్యోగ బాధ్యతలు చేపట్టి 2001 జనవరి 31 రిటైర్ అయ్యారు. అప్పటి నుంచి నేవీ మాజీ సైనికుల సంఘంలో గౌరవ అధ్యక్షుడిగా ఉంటూ మాజీ సైనికులకు సేవలందించారు. పోస్ట్ జస్టిస్ ఎన్‌జీ అసోసియేషన్ అధ్యక్షుడిగా సామాజిక సేవలందించారు. నేవీ నుంచి ఉద్యోగ విరమణ తరువాత ఉన్నత విద్యనభ్యసించడం న్యాయవాదిగా సేవలందించడం వంటి వాటిని పరిగణనలోకి తీసుకుని ఉత్తమ నావికా వెటరన్స్ అవార్డును నావికా దళాధిపతులు అందించారు.

కోట సత్తెమ్మకు పూజలు

నిడదవోలు, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): నిడదవోలు మండలం తిమ్మరాజుపాలెంలో కోట సత్తెమ్మ దేవస్థానంలో ఆదివారం విశేష పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారికి ధూపహారతి, నిత్యార్చనా, లలితా పారాయణం, సహస్రనామ కుంకుమ పూజలు జరిపారు. అనంతరం క్షీర, మహానివేదన చేశారు. ప్రత్యేక పూల అలంకరణలో ఉన్న అమ్మవారిని భక్తులు దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఆదివారం అమ్మవారికి ఇష్టమైన రోజు కావడంతో పలు జిల్లాల నుంచి వచ్చిన భక్తులతో ఆలయం కళకళలాడింది. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా దర్శనం కలుగజేశారు.

వేంకటేశుడి ఆలయాభివృద్ధికి రూ.లక్ష విరాళం

కంబాల శ్రీనివాసరావు



ఆలయ కమిటీకి విరాళం చెక్కును అందజేస్తున్న శ్రీనివాసరావు

రాజానగరం, మార్చి 9(ఆంధ్రజ్యోతి): మండలంలో చక్రద్వారబంధం గ్రామంలో నూతనంగా నెలకొల్పిన శ్రీదేవి భూదేవి సమేత ప్రసన్న వేంకటేశ్వరస్వామి ఆలయ అభివృద్ధికి విశ్వహిందూ ధర్మ పరిరక్షణ రామసేన అధ్యక్షుడు, బీజేపీ నాయకుడు కంబాల శ్రీనివాసరావు రూ.లక్ష విరాళంగా అందజేశారు. ఈ మేరకు ఆదివారం ఆయన ఆలయాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావును ఆలయ కమిటీ, గ్రామ పెద్దలు సత్కరించి, స్వామివారి చిత్రపటాన్ని బహూకరించారు. అనంతరం శ్రీనివాసరావు మాట్లాడుతూ హిందూ ధర్మ పరిరక్షణ, ఆలయాల అభివృద్ధికి కృషి చేస్తానని, రాజానగరం, జగ్గంపేట, రంపచోడవరం నియోజకవర్గాల్లో ఆలయాల అభివృద్ధితో పాటు అనేక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్టు చెప్పారు. కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

గోరంట్ల ప్రీమియర్ లీగ్ క్రికెట్ టోర్నమెంట్



క్రికెట్ టోర్నమెంట్ టీమ్ సభ్యులతో మాట్లాడుతున్న రవికిరణ్

రాజమహేంద్రవరం రూరల్,మార్చి 9(ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి జన్మదినం సందర్భంగా టీడీపీ ఆరోగ్య విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గోరంట్ల రవికిరణ్ ఆధ్వర్యంలో గోరంట్ల ప్రీమియర్ లీగ్ క్రికెట్ టోర్నమెంట్‌ను ప్రారంభించారు. మండలంలోని హుకుంపేట డీమార్టు పక్కనున్న ఖాళీ స్థలంలో మొదటి మ్యాచ్‌ను రవికిరణ్ టాస్ వేసి ప్రారంభించారు. కార్యక్రమంలో మండలాధ్యక్షుడు మత్యేటి ప్రసాద్, పెండ్యాల రామకృష్ణ, దుద్దుపూడి రమేష్, బొప్పన నానాజీ, మట్టా శ్రీను పాల్గొన్నారు.

ఆగి ఉన్న కారును ఢీకొన్న ఆటో

ఆటో డ్రైవర్‌కు గాయాలు

కొవ్వూరు, మార్చి 9(ఆంధ్రజ్యోతి): ఆగి ఉన్న కారును ఢీకొన్న ప్రమాదంలో ఆటో డ్రైవర్‌కు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికుల వివరాల ప్రకారం.. కోరుకొండ మండలం కాపవరం నుంచి కొవ్వూరు మండలం కాపవరం గ్రామానికి కిరాయికి వస్తున్న ఆటో డ్రైవర్ గుగ్గిలం వంశీ కొవ్వూరు మండలంలోని ఏషియన్ పెయింట్స్ గోడౌన్ సమీపంలో హైవేపై రోడ్డు పక్కన ఆగి ఉన్న కారును వెనుక నుంచి ఢీకొన్నాడు. ఈ ప్రమాదంలో ఆటో డ్రైవర్ వంశీకి నడుము, కాళ్లు, చేతులకు తీవ్ర రక్తగాయాలయ్యాయి. దీంతో అతడిని హైవే పెట్రోలింగ్ సిబ్బంది 108 అంబులెన్స్‌లో చికిత్స నిమిత్తం రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

12న ‘యువత పోరు’

రాజమహేంద్రవరంకల్చరల్ మార్చి 9(ఆంధ్రజ్యోతి): ఫీజు రీయింబర్స్‌మెంట్, నిరుద్యోగ భృతి, అమలు పట్ల ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరించడాన్ని నిరసిస్తూ ఈ నెల 12న యువత పోరు పేరిట కలెక్టర్ కార్యాలయం వద్ద ఆందోళన నిర్వహించనున్నట్టు వైసీపీ జిల్లా అధ్యక్షుడు చెల్లుబోయిన వేణు గోపాలకృష్ణ, రాష్ట్ర యువజన విభాగ అధ్యక్షుడు జక్కంపూడి రాజా అన్నారు. ఆదివారం స్థానిక ప్రకాశం నగర్‌లోని జక్కంపూడి నివాసంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో వారు మాట్లాడుతూ ఎన్నికల వాగ్దానాలను నెరవేర్చాలని అందుకోసమే ఈ ఆందోళన చేపట్టామన్నారు. దానికి సంబంధించిన యువత పోరు పోస్టర్‌ను ఆవిష్కరించారు. సమావేశంలో జడ్పీ చైర్మన్ విప్పర్తి వేణుగోపాల్, అడపా అనిల్ పాల్గొన్నారు.



అమ్మా..బాధపడకమ్మా!

కోతి జాతి నుంచి మానవుడు పుట్టాడనేది అక్షరసత్యం.. మనుషులు ఎంత తెలివిగా ఉంటారో కోతులు, కొండ ముచ్చులు కూడా అంతే తెలివిగా ఉంటాయి..కంగారు పెడితే మీదకొస్తాయ్..బాధలో ఉంటే ఓదారుస్తాయ్.. తాళ్లపూడి మండలం తాడిపూడిలో కెమెరాకు చిక్కిన ఈ ఘటనే ఇందుకు నిదర్శనం..ఇటీవల శివరాత్రి స్నానాలకు వెళ్లి తాడిపూడి వద్ద గోదావరిలో మునిగి మృతిచెందిన ఐదుగురు యువకుల చివరిరోజు కార్యక్రమాలు శనివారం నిర్వహించారు.అనిశెట్టి పవన్ కుమార్ తల్లి రజనీ కుమారుడి ఫొటో వంక చూస్తూ రోదిస్తుంది.. ఇంతలో ఒక కొండముచ్చు అటుగా వచ్చి బాధలో ఉన్న తల్లిని ఆమె కుమారుడు ఎలా నిమిరేవాడో అలాగే నిమిరి ఓదార్చింది.. కాసేపు ఆమె ఒడిలో వాలింది..అనంతరం ఆమె పక్కనే పడుకుని వెళ్లిపోయింది. ఇది చూసిన గ్రామస్తులు ఆమె కొడుకే వానరం రూపంలో వచ్చి ఓదార్చిందని అనుకుంటున్నారు. - తాళ్లపూడి



నేడు నరసన్న కల్యాణం

కోరుకొండ నరసన్న కల్యాణోత్సవాలు సోమవారం నుంచి అంగరంగ వైభవంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు.. ఆదివారం రాత్రి ఉత్సవాలకు అంకురార్పణ చేశారు..ఈ మేరకు స్వామిని ప్రత్యేకంగా అలంకరించారు. సోమవారం రథోత్సవం.. అనంతరం కల్యాణోత్సవం చేస్తారు.. ఈ మేరకు ఆలయం వద్ద ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా సౌకర్యాలు కల్పించారు.. కోరుకొండ మొత్తం విద్యుద్దీపాలతో అలంకరణ చేశారు.. ఉత్సవాలు 15వ తేదీ వరకూ జరుగుతాయని ఆలయ పండితులు చెబుతున్నారు. - వివరాలు 8లో

హద్దు..దాటనివ్వదు!



బోటుకు బిగిస్తున్న యంత్రం

ట్రాన్స్‌పాండర్

సముద్రంలో మత్స్యకారుల రక్షణకో మిషన్

ప్రస్తుతం చాలా మంది తండేల్ సినిమా చూసే ఉంటారు.. ఆ సినిమాలో హీరో టీమ్ వేటకు వెళ్లి సముద్రంలో అనుకోకుండా పాకిస్థాన్ సరిహద్దుల్లోకి వెళ్లిపోతారు.. అక్కడ జైలులో మగ్గిపోతారు.. చివరకు హీరోయిన్ పోరాడి వారిని విడిపిస్తుంది.. ఇది రియల్ స్టోరీగా డైరెక్టర్ కథనం.. ఇది నిజమే..ఎందుకంటే సముద్రంలో సరిహద్దులు దాటితే ప్రమాదమే.. అటువంటి ప్రమాదాల నుంచి మత్స్యకారులను తప్పించ డానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ట్రాన్స్‌పాండర్ అనే యంత్రాన్ని బోట్లకు బిగిస్తున్నాయి.



- ఇక 'హద్దు'ల్లో ఉంచేస్తుంది
- బోట్లకు ట్రాన్స్‌పాండర్లు
- ఒక్కో మిషన్ ఖరీదు రూ.21 వేలు
- దేశ హద్దులు దాటకుండా అలెర్ట్
- కి.మీ దూరంలోనే హెచ్చరికలు
- వేటకు వెళ్లే మత్స్యకారులకు రక్షణ
- అప్రమత్తమై వచ్చేందుకు వీలు
- ఇతర దేశాల జైళ్లలో ఎంతో మంది

(కాకినాడ, ఆంధ్రజ్యోతి)

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా నుంచి సముద్రంలో చేపల వేటకు వెళ్లే మత్స్యకారులు అనేక మంది పొరపాటున పొరుగు దేశాల్లోకి వెళ్లి జైలు పాలవుతున్నారు. తెలియకుండా చేసిన తప్పునకు ఏళ్లకు ఏళ్లు ఆయా దేశాల జైళ్లలో మగ్గుతున్నారు. ఇకపై మత్స్యకారులకు ఆ బాధలు తప్పనున్నాయి. సముద్రంలో వేటాడుతున్న బోటు పొరుగు దేశాల సరిహద్దుల్లో అడుగుపెట్టే ప్రమాదం ఉంటే కిలోమీటరు దూరంలో ఉండగానే ఒక యంత్రం హెచ్చ రిస్తుంది. ఆ యంత్రా లను ఇప్పుడు ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో మత్స్యకారుల బోట్లకు అధికారులు బిగిస్తున్నా రు. రూ.21 వేల విలువైన ఒక్కో యంత్రాన్ని మత్స్యశాఖ ఉచితంగా ఇస్తోంది.కేంద్రం,రాష్ట్ర ప్రభుత్వాలు ఉమ్మడిగా నిధులను భరించి మత్స్యకారులకు ఇస్తుండగా బిగింపు ముమ్మరమైంది.

హద్దు దాటితే జైలే..

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో 67 వేల కుటుంబాలకు పైగా చేపల వేటపై ఆధారపడి జీవిస్తున్నాయి. ఇందులో 48 వేల కుటుంబాలు వరకు సముద్రంలో చేపల వేట ద్వారా బతుకు తున్నారు. వీరిలో అనేక మంది మత్స్యకారులు మెకనైజ్డ్ బోట్లపై వారాల తరబడి చెన్నై, ముం బై, గుజరాత్, ఒడిషా తదితర రాష్ట్రాల సముద్ర జలాల్లో ప్రయాణించి చేపల వేట సాగిస్తారు. ఈ క్రమంలో అనేక మంది మత్స్యకారులు తెలి యకుండా పాకిస్తాన్, బంగ్లాదేశ్, శ్రీలంక దేశాల సముద్ర జలాల్లోకి ప్రవేశిస్తున్నారు. దీంతో అక్కడ పోలీసులకు పట్టుబడి ఏళ్ల తరబడి ఆయా దేశాల జైళ్లలో మగ్గిపోతున్నారు.అటు వీరిని విడిపించడం సైతం కేంద్ర ప్రభుత్వానికి పెద్ద సవాల్‌గా మారిపోతోంది.2018 నవం బరు లో ఐ.పోలవరం మండలానికి చెందిన కొందరు మత్స్యకారులు పాకిస్తాన్ జలాల్లోకి వెళ్లి జైళ్లలో మగ్గిపోయారు. అనేక మంది మత్స్యకారులు ఈ తరహా సమస్యలు తరచూ ఎదుర్కొంటున్నారు.

తొలుత వాటికే..

కాకినాడ జిల్లాలో 76 కిలోమీటర్ల మేర సముద్రతీరం ఉంది. తీరం వెంబడి 23 ఫిష్ ల్యాండింగ్ సెంటర్ల ద్వారా 4,150 బోట్లు చేపల వేటకు అనుమతి పొందాయి. ఈ బోట్ల ద్వారా 36,112 మంది ఆధారపడి జీవిస్తున్నారు. వీటిలో తొలుత సుదీర్ఘతీరం సముద్రంలో వేటకు వెళ్లే మెకనైజ్డ్ బోట్లకు ఈ యంత్రాలను బిగిస్తున్నా రు. తొలి విడత కింద ఉమ్మడి జిల్లాలో 1,600 బోట్లకు ఈ యంత్రాలను అమర్చాలని జిల్లా మత్స్యశాఖ లక్ష్యం విధించుకుంది. ఇందులో ఇప్పటి వరకు 350 బోట్లకు ట్రాన్స్‌పాండర్లు బిగించారు. మిగిలిన బోట్లకు బిగించే ప్రక్రియ కొనసాగుతోంది. మోటారైజ్డ్ బోట్లకు సైతం వీటిని బిగించాలని అధికారులు కసరత్తు చేస్తున్నా రు. ట్రాన్స్‌పాండర్లు బిగించాలంటే సంబంధిత బోట్లలో బ్యాటరీలు నిరంతరం పనిచేస్తుండాలి. ప్రస్తుతం ఇవి ఉన్న బోట్లకే యంత్రాలు బిగిస్తు న్నారు. అటు కోనసీమ జిల్లాలో 64 వరకు మెకనైజ్డ్ బోట్లు ఉన్నాయి.వీటికి కూడా బిగింపు ప్రక్రియ కొనసాగుతోంది. ప్రస్తుతం భైరవపాలెంలో ఉన్న బోట్లకు కోనసీమ జిల్లా మత్స్యశాఖ అధికారులు యంత్రాలను అమర్చేపనిలో ఉన్నా రు. తూర్పుగోదావరి జిల్లాలో మెకనైజ్డ్ బోట్లు ఉన్నా సముద్రంలో వేటకు వెళ్లేవి తక్కువే.

బోట్లకు కుయ్..కుయ్

కేంద్రం మత్స్యకారుల భద్రతకు పీఎంఎం ఎస్ వై పథకం కింద ట్రాన్స్‌పాండర్లను ప్రవేశ పెట్టింది. వీటిని సముద్రంలో వేటకు వెళ్లే బోట్లకు అమ ర్చుతోంది. ట్రాన్స్‌పాండర్లు ఉన్న బోట్లు పొరపాటున పొరుగుదేశాల సముద్ర జలాల్లోకి వెళ్లే ప్రమాదం ఉంటే కిలోమీటరు దూరం ఉండగానే హెచ్చరిస్తాయి. తద్వారా పొరుగు దేశాలకు చిక్కకుండా మత్స్యకారులు సురక్షితంగా ఉండేలా ఇవి కీలకపాత్ర పోషించనున్నాయి.ఒక్కో ట్రాన్స్ పాండర్ ధర రూ.21 వేలు.కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు ఉచితంగా ఇస్తున్నాయి.ప్రస్తుతం వీటి బిగింపు కాకినాడ, కోనసీమ జిల్లాల్లో ఊపందుకుంది. ట్రాన్స్‌పాండర్లు ఉన్న బోట్లను అటు రాష్ట్ర ప్రభుత్వం, ఇటు కేంద్ర ప్రభుత్వం తరచూ పర్యవేక్షించనున్నాయి. తద్వారా అంతర్జాతీయ సరిహద్దుల దగ్గరకు వెళ్లే ముప్పు ఉంటే హెచ్చరించడంతో పాటు సముద్రంలో తుఫాన్లు, ఇతర ఆపద ఏది ఎదురైనా కాపాడేందుకు సిద్ధంగా ఉంటాయి.ఒకసారి ట్రాన్స్‌పాండర్‌ను బోటుకు బిగించిన తర్వాత శాటిలైట్‌తో బోటు అనుసంధానం అయిపోతుంది. తద్వారా ఏ సమస్య వచ్చినా మత్స్యకారులకు ఇబ్బంది ఉండదు.ఇన్‌కాయిస్ (ఇండియన్ నేష నల్ సెంటర్ ఫర్ ఓషన్ ఇన్ఫర్మేషన్ సర్వీస్) ద్వారా సముద్రంలో చేపలు ఎక్కువ ఎక్కడ ఉన్నాయనే సమాచారం సైతం ఎస్ఎంఎస్‌ల ద్వారా ఇన్‌కాయిస్‌నుంచి మత్స్యకారులకు అందుతుంది.

నో ఛాన్స్!



- ఒక్కరినీ వరించని ఎమ్మెల్సీ పదవి
- ఉమ్మడి జిల్లా నేతల్లో నిరాశ
- ఆశావహులకు బుజ్జగింపులు
- వచ్చేసారి చూద్దామని హామీ

(రాజమహేంద్రవరం- ఆంధ్రజ్యోతి)

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలోని కూటమి నేతలకు నిరాశ ఎదురైంది.. ఎమ్మెల్యేల కోటాలో ఎమ్మెల్సీ పదవి ఆశించిన నేతల ఎదురుచూపులు ఫలించలేదు.. పదవి తప్ప కుండా వస్తుందని ఆశించిన నాయకులకు నిరాశే మిగిలింది. ముఖ్యంగా తెలుగుదేశం పార్టీ నుంచి ఎక్కువ మంది ఎమ్మెల్సీలు ఆశించారు. ఉమ్మడి జిల్లాలో ఒక రెండు ఎమ్మెల్సీలు లభిస్తాయని అంతా ఊహించినా లెక్కతప్పింది. అధిష్ఠానం ఒక్కటీ కేటాయించలేదు.

పలువురికి నిరాశే..

సార్వత్రిక ఎన్నికల్లో కూటమిలో సీట్ల సర్దుబాట్ల మధ్య కొందరికి టికెట్లు దక్కలేదు. అప్పుడు ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా పలువురు నేతలకు ఎమ్మెల్సీ కోటాలో చూద్దామని పార్టీ అధిష్ఠానం హామీ ఇచ్చింది.ఈ నేపథ్యంలో చాలా మంది ఎదురు చూశారు. కానీ రాష్ట్రంలో కేవలం ఐదు ఎమ్మెల్సీ స్థానాలు మాత్రమే ఖాళీ అవ్వడం వల్ల తెలుగుదేశం 3, జనసేన 1, బీజేపీ 1 కేటాయించారు. దీని వల్ల ఆశావహులకు అవకాశం రాలేదు. ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో పిఠాపురం మాజీ ఎమ్మెల్యే వర్మ,నిడదవోలు మాజీ ఎమ్మెల్యే బూరుగుపల్లి శేషారావుకు పదవి ఇస్తామని అధిష్ఠానం హామీ ఇచ్చింది. కొవ్వూరు మాజీ ఎమ్మెల్యే, మాజీ మంత్రి కెఎస్ జవహర్‌కు హామీ ఇచ్చినట్టు ప్రచారం జరిగింది. ఇక కోనసీమ నుంచి మాజీ ఎమ్మెల్సీ రెడ్డి సుబ్రహ్మణ్యం కూడా పదవి ఆశించారు.రాష్ట్రంలో ఎక్కువగా ఆశించే వారి సంఖ్య బాగా పెరడంతో అధిష్ఠానానికి ఇబ్బందికరంగా మారింది. సర్దుబాట్ల వల్ల పలువురు ఎమ్మెల్సీ ఆశలు నీరుగారిపోయాయి.ఈ మేరకు సీఎం చంద్రబాబు టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాస్‌తో మాట్లాడి తర్వాత ఎప్పుడు ఎమ్మెల్సీ ఖాళీ అయినా హామీ ఇచ్చిన వారికి ఇస్తామని చెప్పాలని ఆదేశించారు.ఈ నేపథ్యంలో టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు, గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాస్ ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలోని ఇద్దరు నేతలకు ఫోన్ చేసి పరిస్థితిని వివరించారు. 2027లో ఎక్కువ ఎమ్మెల్సీ స్థానాలు ఖాళీ అవుతాయని..అప్పుడు మీకు కచ్చితంగా స్థానం కల్పిస్తామని స్వయంగా సీఎం చంద్రబాబు చెప్పమన్నారని చెప్పడం గమనార్హం.

యనమలకు కీలక పదవి?

ప్రస్తుతం ఎమ్మెల్సీగా ఉన్న ఆర్థిక శాఖ మాజీ మంత్రి యనమల రామకృష్ణుడు పదవి కాలం ఈనెల 29తో ముగియనుంది. ఈసారి ఆయన ఎమ్మెల్సీని ఆశించినా దక్కలేదని సమాచారం. సీఎం చంద్రబాబుకు సన్నిహితుడు, టీడీపీలో కీలకనేతగా ఉన్న యనమలకు త్వరలోనే మరో కీలక పదవి రానున్నట్టు ప్రచారం జరుగుతోంది. రాజ్యసభ సభ్యత్వం వస్తుందని లేదా గవర్నర్ పదవి లభిస్తుందనే ప్రచారం ఉంది.తుని నియోజకవర్గం పరిధిలోని తేటగుంటలో హైవే సమీపంలో తోటలోని ఆయన ఇంటివద్ద ఇటీవల పెద్ద గేటు నిర్మిస్తుండడంతో పాటు, గేటు సమీపంలో బంకర్ కూడా ఏర్పాటు చేస్తున్నట్టు చెబుతున్నారు. ఈ నేపథ్యంలో ఏదో కీలక పదవి రాబోతుందనే ప్రచారం ఊపందుకుంది.



బలభద్రపురంలో విలేకరులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రామకృష్ణారెడ్డి

చెత్త ప్లాంట్ ఏర్పాటు చేస్తామంటే ఊరుకోం

- ఎక్కడో చెత్తను బలభద్రపురం తరలిస్తామంటే ఊరుకోం
- ఎంత వరకైనా పోరాడతాం
- అనపర్తి ఎమ్మెల్యే రామకృష్ణారెడ్డి

బిక్కవోలు, మార్చి 9 (ఆంధ్రజ్యోతి) : తూర్పుగోదావరి, కాకినాడ జిల్లాల్లో మున్సిపాలిటీల నుంచి వచ్చే చెత్తను తెచ్చి బలభద్రపురం, కాపవరం గ్రామాల వద్ద విద్యుదుత్పత్తి ప్లాంట్ పరిశ్రమ ఏర్పాటు చేస్తామంటే ఊరుకునేది లేదని అనపర్తి ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి అన్నారు. బిక్కవోలు మండలం బలభద్రపురంలో ఆదివారం విలేకరులతో మాట్లాడారు. మునిసిపల్ పట్టణాభివృద్ధి శాఖ మంత్రి నారాయణ శనివారం విద్యుదుత్పత్తి ప్లాంట్ స్థల పరిశీలన చేయడంపై ఆయన తీవ్రంగా స్పందించారు. మునిసిపాలిటీల చెత్తను ఇక్కడికి తీసుకువచ్చే ప్రతిపాదనలు ఎలా ఇచ్చారంటూ కలెక్టర్లను దుయ్యబట్టారు. ఈ ప్రతిపాదనను స్థానిక ప్రజలు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారన్నారు.ఎట్టి పరిస్థితుల్లోను ఈ ప్రతిపాదన ఆమోదించేది లేదన్నారు. గత వైసీపీ ప్రభుత్వ నిర్వాకంతో బలభద్రపురంలో ఏర్పాటు చేసిన గ్రాసిం పరిశ్రమ కారణంగా తీవ్ర కాలుష్యం వెదజల్లుతుందన్నారు. ప్రస్తుతం ఇక్కడ వందలాది ప్రజలు క్యాన్సర్ వ్యాధి బారిన పడుతుంటే ఇప్పుడు కూటమి ప్రభుత్వం చేస్తున్న నిర్వాకం ఇదా అంటూ ప్రశ్నించారు. కలెక్టర్లు ప్రతిపాదన పంపారా లేక పరిశీలన మాత్రమేనా అసలు ఈ ప్లాంట్ వ్యవహారం ఏ స్థాయిలో ఉందనేది స్పష్టం చేయాలని డిమాండ్ చేశారు. ఏ స్థాయిలో ఉన్నా స్థానిక ప్రజల అభిప్రాయం మేరకు మేము దీన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామన్నారు. ఈ ప్రతిపాదనను ఆపాలని సీఎం చంద్రబాబు, మునిసిపల్ శాఖ మంత్రి నారాయణ, డిప్యూటీ సీఎం పవన్, మంత్రి లోకేశ్ దృష్టికి తీసుకెళతానని తెలిపారు. ప్రజాభిప్రాయం తెలుసుకోకుండా ఎక్కడో ఉన్న చెత్తను ఇక్కడకు తరలిస్తామంటే ఊరుకోమన్నారు.అవసరమైతే ఏ స్థాయికైనా వెళ్లి పోరాడతామన్నారు.సమావేశంలో సర్పంచ్ బుంగా రామారావు,మాజీ ఎంపీటీసీ నల్లమిల్లి వెంకటసుబ్బారెడ్డి, ఎంపీటీసీ చిన్నం రాఘవ పాల్గొన్నారు.

సన్..డే!

జనం ఆపసోపాలు



రాజమహేంద్రవరం సిటీ, మార్చి 9 (ఆంధ్రజ్యోతి) : సన్..డే మంటలు.. జనం ఆపసోపాలు.. వేసవి ఆరంభంతోనే భానుడు నిప్పులు కక్కుతున్నాడు. రాజమహేంద్రవరంలో ఆదివా రం ఎండ తీవ్రత పెరిగింది. దీంతో ప్రజలు ఎండవేడిమి నుంచి తట్టుకునేందుకు సమ్మర్ సేఫ్టీ వైపు పరుగులు తీస్తున్నారు. రాజమహేంద్రవరంలో ఆదివారం అత్యధికంగా 38 డిగ్రీలు ఉష్ణోగ్రత నమోదైంది. కనిష్టంగా 21.0 డిగ్రీలు నమోదైంది. దీంతో వాహనదారులు, బాటసారులు ఆపసోపాలు పడ్డారు. ముఖానికి మాస్కులు, తలకు టోపీలు ధరించారు. అధిక ఉష్ణం నుంచి ఉపశమనం కోసం చల్లనిపానీయాలతో సేదతీ రారు. ఆదివారం కావడంతో బయటకు వచ్చిన వాళ్ళు త్వరగా పనులు ముగించుకుని ఇళ్ళకు చేరుకున్నారు. మధ్యాహ్నం రోడ్లన్నీ ఖాళీగా దర్శనమిచ్చాయి. సోమవారం నుంచి ఎండల తీవ్రత మరింత పెరిగే అవకాశం ఉందని వాతావరణ శాఖ అధికారులు హెచ్చరిస్తున్నారు.

క్రికెట్ బెట్టింగ్ ముఠాపై పోలీసుల దాడి

20 మంది అరెస్టు?

రాజానగరం, మార్చి 9 (ఆంధ్రజ్యోతి) : క్రికెట్ బెట్టింగ్ ముఠాపై ఆదివారం రాత్రి పోలీసులు దాడి చేసినట్టు సమాచారం. ఛాంపియన్స్ ట్రోఫీ ఫైనల్స్ మ్యాచ్ ఇండియా న్యూజిలాండ్ మధ్య ఆదివారం రాత్రి హోరాహోరీగా జరిగింది.ఈ మ్యాచ్‌పై అంచనాలు పెరిగిపోయాయి. దీంతో బెట్టింగ్ రాయుళ్ల గల్లాపెట్టే తెరిచారు. రాజానగరం పోలీస్ స్టేషన్ పరిధిలోని బ్రిడ్జ్ కౌం టీలో భారీగా క్రికెట్ బెట్టింగ్ సాగుతుందన్న సమాచారంతో పోలీసులు దాడి చేసినట్టు తెలిసింది.దీనిలో భాగంగా 20 మంది బెట్టింగ్ రాయుళ్లతో పాటుగా భారీస్థాయిలో నగదు,కంప్యూటర్లు, ల్యాప్‌టాప్‌లు,సెల్‌ఫోన్లు పోలీసులు స్వాధీనం చేసుకున్నట్టుగా తెలిసింది.ఈ విషయమై పోలీసులు సరైన సమాచా రం ఇవ్వకుండా గోప్యంగా ఉంచుతున్నారనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.



ఓ ప్రైవేటు షాపులో ఏర్పాటు చేసిన సిట్టింగ్

నేడు బార్లు మూత?

రాజమహేంద్రవరం, మార్చి 9(ఆంధ్రజ్యోతి): బార్‌లు మూసేసి తాళాలు ఎక్సైజ్ అధికారులకు ఇచ్చేయాలని యజమానులు ఆలోచన చేస్తున్నారు.కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత 2024-26 మద్యం పాలసీని తీసుకొచ్చింది. ప్రైవేటు మద్యం షాపు లకు లైసెన్సు ఇచ్చింది.కూటమి ప్రభుత్వం కొత్త మద్యం పాలసీ తీసుకొచ్చే సమ యంలో బార్‌లు అక్టోబరు వరకూ లైసెన్సు ఫీజును చెల్లించాయి కాబట్టి ప్రైవేటు మద్యం షాపులకు ఆ సమయం వరకూ పర్మిట్ రూమ్‌లు వద్దని ఎక్సయిజ్ కమిషనర్‌కి విన్నవించగా సమ్మతించారు. అయితే ప్రస్తుత పరిస్థితి అందుకు విరుద్ధంగా ఉంది. ప్రైవేటు మద్యం షాపుల్లో అనధికారికంగా భారీ సిట్టింగ్‌లు ఏర్పాటు చేశారు. దీంతో బార్‌లు నష్టాల్లో చిక్కుకున్నాయి.ఈ విషయంలో ఎక్సైజ్ సూపరిం టెండెంట్‌కి ఆధారాలతో సహా ఎన్నిసార్లు విన్నవించినా ఎందుకనో ఫలితం లేదని బార్‌ల యజమానులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.ఈ నేపథ్యంలో బార్‌లకు సోమ వారం తాళాలు వేసేసి వాటిని ఎక్సైజ్ సూపరిం టెండెంట్‌కి ఇచ్చేద్దామని నిర్ణయం తీసుకున్నట్టు సమాచారం.మరో వైపు మంగళవారం విజయవాడ ఎక్సైజ్ సూపరింటెం డెంట్ కార్యాలయంలో సమావేశం ఉంది. దీనికి జిల్లా నుంచి ఎక్సైజ్ అధికారులు వెళ్లారు. సమావేశంలో తమకు అనుకూల నిర్ణయం తీసుకుంటారనే ఉద్దేశంతో సంయమనం పాటించాలని బార్‌ల యజమానులు అనుకుంటున్నట్టు తెలుస్తోంది. దీంతో నేడు ఎక్సైజ్ కమిషనర్‌తో జరిగే సమావేశం కీలకంగా మారనుంది.



కొవ్వూరు సంస్కృత పాఠశాల శివాలయంలో ఆదివారం గోష్పదేశ్వరస్వామి ప్రత్యేక అలంకరణలో ఇలా భక్తులకు దర్శనమిచ్చారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

తాళ్లపూడి, మార్చి 9 (ఆంధ్రజ్యోతి) : తాళ్లపూ డి పరస పద్మరాజారావు ప్రభుత్వ ఉన్నత పాఠ శాలలో ఆదివారం పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనాన్ని నిర్వహించారు. 1983-84 సంవత్స రంలో చదువుకున్నవారంతా ఒకచోట కలిశారు. ఈ సందర్భంగా ఆనాటి జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. అప్పటి గురువులైన సీహెచ్ ఆంజేయులు, కే. సుశీలను ఘనంగా సత్కరిం చారు. కార్యక్రమంలో పూర్వవిద్యార్థులు తైలం రామకృష్ణ, హన్సారాం మాలీ(తారారాం) జడ్డు శ్రీనివాస్, గోకవరపు బదరీరాజ్‌కుమార్, కృష్ణకుమార్, తాటికొండ నాగేశ్వరరావు, వర లక్ష్మి, రాజేశ్వరి, తదితరులు పాల్గొన్నారు. కార్య క్రమానికి టీటీడీ ధర్మ ప్రచారక్ పరస రాధా కృష్ణ ప్రత్యేక ఆహ్వానితులుగా హాజరయ్యారు.

గోష్పదేశ్వరస్వామి ఆలయంలో లక్ష బిళ్వార్చన



పూజలందుకుంటున్న స్వామివారు

కొవ్వూరు, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): కొవ్వూరు పట్టణంలోని సంస్కృత పాఠశాల ప్రాంగణంలో వేంచేసియున్న శ్రీలలిత పార్వతీ సమేత గోష్పదేశ్వరస్వామికి ఆదివారం లక్ష బిళ్వార్చన నిర్వహించారు. ఆలయ అర్చకుడు మానేపల్లి సుబ్రహ్మణ్యశాస్త్రి ఆధ్వర్యంలో భక్తుల సహకారంతో ప్రత్యేక పూజలు చేశారు. ఉదయం నుంచి గణపతిపూజ, లఘున్యాసం, ఏకాదశ వార రుద్రాభిషేకాలు, రుద్రహోమం, అమ్మవారికి శ్రీసూక్త విధానంలో లక్ష కుంకుమ పూజ చేశారు. అనంతరం దేవతామూర్తులను విశేష అలంకరణ చేసి నీరాజన మంత్ర పుష్పాలు సమర్పించారు. కార్యక్రమంలో మానేపల్లి సుందర గణేష్, రాణి శ్రీనివాస్, తెన్నేటి సూర్యనారాయణ, పమ్మి రవిబాబు, డీ. నవీన్, కొవ్వూరు పట్టణ పరిసర ప్రాంతాలకు చెందిన భక్తులు, మహిళలు అధికసంఖ్యలో పాల్గొన్నారు.

తాళ్లపూడిలో సినిమా షూటింగ్ సందడి



చిత్ర యూనిట్ బృందంతో మాట్లాడుతున్న డైరెక్టర్ మహేష్‌కుమార్

తాళ్లపూడి, మార్చి 9 (ఆంధ్ర జ్యోతి) : తాళ్లపూడిలో సినిమా షూటింగ్ సందడి నెలకొంది. మైత్రీ మూవీ మేకర్స్ సంస్థ నిర్మిస్తున్న సినిమా ప్రొడక్షన్ నెం రాపో 22 చిత్రాన్ని చిత్రీక రిస్తున్నారు. ఇందులో భాగంగా ఆదివారం హీరో రామ్ పోతినే నిపై పలు సన్ని వేశాలను చిత్రీకరించారు. డైరెక్టర్ మహేష్ ఈ చిత్రానికి దర్శకత్వం వహిస్తున్నారు. హీరోయిన్‌గా భాగ్యశ్రీ బోస్లే, నిర్మాతలుగా నవీన్ యర్నేని, రవిశంకర్, ప్రొడక్షన్ మేనేజర్‌గా ఉమాశంకర్ వ్యవహరిస్తున్నారు. చిత్ర బృంద సభ్యులు పాల్గొన్నారు.

బాలికకు ఆర్థిక సాయం



సాయాన్ని అందిస్తున్న ఎస్ఐ వెంకటేశ్వరరావు

పెరవలి,మార్చి9 (ఆంధ్రజ్యోతి): పెరవలికి చెందిన ఓ బాలికకు ఎస్ఐ వెంకటేశ్వరరావు రూ. ఐదు వేలు ఆర్థికసాయం అందించారు. కల్యాణి వరలక్ష్మి అనే మహిళకు ఐదు సంవత్సరాల వయసు గల మౌనిక అనే కుమార్తె ఉంది. ఇటీవల ఆమె ప్రమాదవశాత్తు కాలిపోయింది. వైద్య ఖర్చుల నిమిత్తం అందించారు.

పీ4 సర్వేకు ప్రజలు సహకరించాలి

ఉండ్రాజవరం, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న పీ4 సర్వేకు ప్రజలు సహకరించాలని ఎంపీడీవో వీఎస్ రామారావు ఒక ప్రకటనలో కోరారు. పేదలకు ఆర్థిక సాధికారిత చేకూర్చడమే ఈ సర్వే ముఖ్య ఉద్దేశమని చెప్పారు. గ్రామాల్లో సచివాలయ ఉద్యోగులు ప్రతి ఇంటికి వెళ్లి సర్వే చేయాలని సూచించారు. మండలంలోని 15 గ్రామాల్లో సర్వే నిర్వహిస్తున్నట్టు చెప్పారు.

పేదల ఆరోగ్యంపై ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ

● ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు



సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే ముప్పిడి, ద్విసభ్య కమిటీ సభ్యులు

కొవ్వూరు, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): పేద, మధ్య తరగతి ప్రజల ఆరోగ్యంపై కూటమి ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ కనబరుస్తోందని కొవ్వూరు ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు అన్నారు. ఆదివారం కొవ్వూరు నియోజకవర్గ టీడీపీ కార్యాలయంలో ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి మంజూరైన రూ. 14,12,907 చెక్కులను లబ్ధిదారులకు పంపిణీ చేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ అనారోగ్యానికి గురై ఎన్టీఆర్ వైద్య సేవలో కవర్ కానీ, ప్రైవేటు ఆసుపత్రులలో వైద్యం చేయించుకుని ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నవారిని సీఎంఆర్ఎఫ్ నుంచి ఆదుకోవడం జరుగుతుందన్నారు. ఇటీవల తాడిపూడి గ్రామానికి చెందిన ఐదుగురు యువకులు మహాశివరాత్రి రోజున గోదావరి స్నానానికి వెళ్లి మృత్యువాత పడగా, ఒక్కొక్క కుటుంబానికి రూ. ఐదు లక్షలు చొప్పన మొత్తం రూ. 25 లక్షలు అందించామన్నారు. కార్యక్రమంలో ద్విసభ్య కమిటీ సభ్యుడు కంటమణి రామకృష్ణారావు, జొన్నలగడ్డ సుబ్బరాయచౌదరి, సూరపనేని చిన్ని, సూర్యదేవర రంజిత్, పొట్రు సిద్ధూ, ఉండవల్లి రాజగోపాల్, తుంపల్లి ఆదినారాయణ, కుందుల మోహన సురేంద్ర, చింతపల్లి సతీష్, ఎరుబండి వెంకట్రావు, ఉప్పులూరి చిరంజీవి, కేవీకే రంగారావు , తదితరులు పాల్గొన్నారు.

పుంతరోడ్లు అభివృద్ధి చేస్తాం : ఎమ్మెల్యే మద్దిపాటి



దూబచర్లలో గ్రావెల్ రోడ్డును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే వెంకట్రాజు

నల్లజర్ల, మార్చి9 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలో పుంత రోడ్లను అభివృద్ధి చేసి రైతులకు అండగా ఉంటామని ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట్రాజు, జడ్పీ మాజీ చైర్మన్ ముళ్ళపూడి బాపిరాజు అన్నారు. ఆదివారం దూబచర్లలో రైతులు వేసుకున్న గ్రావెల్ రోడ్డును వారు ప్రారంభించి మాట్లాడుతూ రైతులకు గిట్టుబాటు ధరతోపాటు, కాల్వల అనుసంధానం, రహదారుల అభివృద్ధి వంటి అంశాలను పరిశీలించి కార్యచరణ రూపొందిస్తామన్నారు.

శ్మశాన వాటికలో స్నానఘట్టాలు ప్రారంభం

నల్లజర్ల శ్మశానవాటికలో స్నానఘట్టాలను అదే గ్రామానికి చెందిన మల్లిపూడి భాస్కరరావు జ్ఞాపకార్థం వారి కుమారులు ఏర్పాటు చేశారు. వాటిని ఎమ్మెల్యే మద్దిపాటి, ముళ్ళపూడి, జనసేన కన్వీనర్ డొడ్డిగర్ల సువర్ణరాజు ప్రారంభించారు. టీడీపీ సీనియర్ నాయకులు కూచిపూడి భాస్కరరావు, మల్లిపూడి రాజారావు, విడియల శ్రీను, గుదే సుబ్బారావు, సవలం రామకృష్ణ, సింహ, తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఉద్యోగి అంకితభావంతో పనిచేయాలి

● విద్యుత్‌శాఖ ఎస్ఈ తిలక్



నల్లజర్ల, మార్చి9 (ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్క ఉద్యోగి అంకితభావంతో పనిచేయాలని విద్యుత్‌శాఖ ఎస్ఈ తిలక్ అన్నారు. నల్లజర్ల సబ్‌స్టేషన్ పరిధిలో ఎల్ఐగా పనిచేసిన ఈదా డేవిడ్ పదవీ విరమణ సందర్భంగా ఆదివారం అల్లాడ రామకృష్ణ కల్యాణ మండపంలో అభినందన సభను ఏర్పాటు చేశారు. ముఖ్యఅతిథిగా హాజరైన ఎస్ఈ మాట్లాడుతూ ఉద్యోగ నియామాలను ప్రతి ఉద్యోగి నిబద్ధతతో పనిచేయాలన్నారు. అనంతరం పలువురు మాట్లాడుతూ ఉద్యోగ జీవితంలో మంచి సేవలు అందిస్తే చిరస్థాయి గుర్తింపు లభిస్తుందన్నారు. కార్యక్రమంలో జడ్పీ మాజీ చైర్మన్ ముళ్ళపూడి బాపిరాజు, విద్యుత్ శాఖ ఈఈ నారాయణ అప్పారావు, 1104 యూనియన్ కార్యదర్శి రమేష్,నరసింహారావు, సత్యనారాయణ, ఏఈ రమణ, బాపిరాజు, లైన్‌మెన్ తాతబ్బాయి శ్రీనివాస్, సూర్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

ఈదా డేవిడ్ దంపతులను సత్కరిస్తున్న విద్యుత్ శాఖ ఎస్ఈ

వైద్యశిబిరాలను వినియోగించుకోవాలి



వైద్యశిబిరాన్ని ప్రారంభిస్తున్న జనసేన నేత డాక్టర్ కల్యాణ్ చక్రవర్తి

నిడదవోలు, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో వైద్యులు నిర్వహించే ఉచిత వైద్యశిబిరాలను ప్రజలు సద్వినియోగపర్చుకుని, వారి ఆరోగ్యాలు రక్షించుకోవాలని జనసేన నేత, ప్రముఖ ఆర్థోపెడిక్ సర్జన్ డాక్టర్ తోపరాల కల్యాణ్ చక్రవర్తి అన్నారు. ఆదివారం నిడదవోలు పట్టణంలోని సిరిఐసీయూ ఎమర్జెన్సీ హాస్పటల్‌లో ఉచిత వైద్యశిబిరాన్ని నిర్వహించారు. దీనికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడుతూ ఆసుపత్రి యాజమాన్యం ఈ శిబిరాన్ని నిర్వహించడం ఎంతో అభినందనీయమన్నారు. క్రిటికల్ కేర్ స్పెషలిస్ట్ డాక్టర్ సిద్ధార్థ కన్నాజీ ఆధ్వర్యంలో సుమారు 62 మందికి ఉచిత వైద్యపరీక్షలు నిర్వహించారు. డాక్టర్ ఎన్.శ్రీరామ్మూర్తి, డాక్టర్ తోట శిరీష పాల్గొన్నారు.

కనకదుర్గమ్మ తీర్థమహోత్సవాలు ప్రారంభం

గోపాలపురం, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): నందిగూడెంలో వేంచేసిన కనకదుర్గమ్మ వారి తీర్థమహోత్సవాలు ఆదివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈనెల 14వ తేదీ వరకు జరగనున్నాయి. ఈ సందర్భంగా ఆదివారం అమ్మవారికి ప్రీతికరమైన రోజు కావడంతో భక్తులు అధిక సంఖ్యలో వచ్చి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం పలువురు మొక్కులు తీర్చుకున్నారు.

నేడు నగర పాలక సంస్థలో మీకోసం కార్యక్రమం

రాజమహేంద్రవరం సిటీ, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): రాజమహేంద్రవరం నగర పాలక సంస్థ కార్యాలయంలో సోమవారం ఉదయం పది గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ప్రజాసమస్యల పరిష్కార వేదిక మీకోసం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్టు కమిషనర్ కేతన్ గార్గ్ తెలిపారు. ఈ మేరకు ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. అర్జీదారులు దీన్నిఉపయోగించుకోవాలన్నారు.

రైలు ఢీకొని వృద్ధుడి మృతి

అనపర్తి, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): తూర్పు గోదావరి జిల్లా అనపర్తి రైల్వే స్టేషన్‌లో ఆదివారం పట్టాలు దాటుతుండగా రైలు ఢీకొనడంతో ఓ వృద్ధుడు మృతి చెందాడు. జిల్లా కేంద్రం కాకినాడ పరిధిలోని ఇంద్రపాలెంకు చెందిన సింహాద్రి పభాకరరావు(70) ఆదివారం అనపర్తి రైల్వేస్టేషన్‌లో సామర్లకోట వైపు నుంచి వచ్చిన రత్నాచల్ ఎక్స్‌ప్రెస్ దిగి మొదటి ప్లాట్ ఫారమ్ ఎక్కుతుండగా రాజమహేంద్రవరం వైపు వెళుతున్న జన్మభూమి ఎక్స్‌ప్రెస్ ఢీకొట్టింది. దీంతో అక్కడికక్కడే మృతి చెందాడు. ప్రమాదం జరగడంతో.. అనపర్తిలో జన్మభూమి ఎక్స్‌ప్రెస్‌కు హాల్ట్ లేకపోయినప్పటికీ లోకో పైలెట్ 20 నిమిషాల పాటు రైలును నిలుపుదల చేసి సామర్లకోట రైల్వే పోలీసులకు సమాచారం అందించారు. మృతుడి సంచిలో లభించిన ఆధార్‌కార్డు ఆధారంగా బంధువులకు సమాచారం అందించినట్టు అనపర్తి రైల్వే పోలీసులు తెలిపారు.

దుద్దుకూరులో సీతారాముల విగ్రహప్రతిష్ఠ



విగ్రహప్రతిష్ఠ మహోత్సవానికి హాజరైన భక్తులు

దేవరపల్లి, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): దుద్దుకూరులో నూతనంగా నిర్మించిన సీతారాముల ఆలయంలో విగ్రహాన్ని ఆదివారం ఘనంగా ప్రతిష్ఠించారు. 130 సంవత్సరాల క్రితం నిర్మించిన ఈ ఆలయం శిథిలావస్థకు చేరుకోవడంతో గ్రామస్తులు, దాతల సహకా రంతో రూ. రెండుకోట్లతో పునఃనిర్మించారు. ఉదయం 10.52 నిమిషాలకు సీతారాముల విగ్రహాలు ప్రతిష్ఠించారు. చాగల్లు మండలం ధారవరం గ్రామానికి చెందిన రావిపాటి వరప్రసాద్ సిద్ధాంతి ఆధ్వర్యంలో విశేషపూజలు నిర్వహించారు. వేలాదిమంది భక్తులు వచ్చి స్వామివారిని దర్శించుకున్నారు. ఆలయం వద్ద భారీ అన్న సమారాధన చేశారు. ఎమ్మెల్యేలు మద్దిపాటి వెంకట్రాజు, ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు, మాజీ హోంమంత్రి తానేటి వనిత, జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు విశ్వేశ్వరరెడ్డి, ఆలయ కమిటీ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

నేడు కోరుకొండ నరసన్న కల్యాణం

● 15వ తేదీ వరకు స్వామివారి ఉత్సవాలు



విద్యుత్‌దీపాలతో కొండను అలంకరించిన దృశ్యం

కోరుకొండ, మార్చి 9(ఆంధ్రజ్యోతి): నవ నరసింహ క్షేత్రాల్లో ఒకటైన స్వయంభూ కోరుకొండ లక్ష్మీనరసింహస్వామి కల్యాణోత్సవాలు ఆదివారం రాత్రి ఆలయ ముఖ మండపంలో ఘనంగా ప్రారంభమయ్యాయి. అంతకు ముందు మంగళవాయిద్యాలు, మేళతాళాలతో శ్రీచక్ర పెరుమాళ్లను తీసుకుని దేవుడి కోనేటి వద్దకు వెళ్లి పుట్టకు శాస్త్రోక్తంగా పుస్తకు పూజలు చేసి పుట్టమన్ను సేకరించారు. అనంతరం ఆలయం వద్ద అంకురార్పణ, ధ్వజారోహణ కార్యక్రమాలు పాణింగపల్లి పవన్కుమార్ ఆచార్యులు ఆధ్వర్యంలో అనువంశిక ధర్మకర్త పరాసర రంగరాజభట్టర్ పర్యవేక్షణలో నిర్వహించారు. వార్షిక బ్రహ్మోత్సవాలకు అన్నవరం దేవస్థానం అధికారులు పర్యవేక్షణలో వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు సమన్వయంతో ఏర్పాట్లు చేశారు. రథోత్సవం సందర్భంగా సోమవారం ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా డీఎస్పీ వై.శ్రీకాంత్, సీఐ వై.సత్యకిషోర్ ఆధ్వర్యంలో పోలీస్ బందోబస్తు ఏర్పాట్లు చేశారు. ఈ మేరకు ఆలయం వద్ద పోలీస్ అవుట్‌పోస్టు ఏర్పాటు చేశారు. జాతరలో ఎటువంటి అవాంచనీయ సంఘటనలు జరగకుండా కోరుకొండ మొత్తం సీసీ కెమెరాల పర్యవేక్షణలో ఉంచామని డీఎస్పీ తెలిపారు. స్వామి వారి కల్యాణోత్సవాల నిర్వహణకు అన్నవరం దేవస్థానం ఈవో వీర్ల సుబ్బారావు, చైర్మన్ వైవీ రోహిత్, కోరుకొండ దేవస్థానం చైర్మన్ రంగరాజ భట్టర్ ప్రత్యేక సిబ్బంది తరలివచ్చారు. దేవదాయ ధర్మదాయశాఖ నుంచి ఉత్సవాలకు 250మంది సిబ్బందిని నియమించారు. అలాగే దేవదాయ ధర్మదాయ శాఖ నుంచి డిప్యూటేషన్‌పై మరికొంత మంది సిబ్బంది, అదనపు అర్చకస్వాములు, వేద పండితులు వచ్చారు.



పుట్టమన్ను తీసుకొస్తున్న అనువంశిక ధర్మకర్త

● నేడు రథోత్సవం, కల్యాణం

రథోత్సవం సోమవారం మధ్యాహ్నం 1.56 గంటలకు నిర్వహించనున్నారు. రథోత్సవానికి ముందు స్వామి వారిని పెండ్లి కుమారుడు, అమ్మవారిని పెండ్లి కుమార్తెగా అలంకరించి ప్రత్యేక పల్లకిలో మంగళ వాయిద్యాలు, మేళతాళాల మధ్య తోడ్కొని వచ్చి రథంపై ఆశీనులను చేస్తారు. రథానికి ప్రత్యేక పూజలు చేసి వేలాది మంది భక్తుల గోవిందనామ స్మరణ మధ్య స్వామివారి దేవస్థానం నుంచి రథోత్సవం బయలు దేరుతుంది. రాత్రి తొమ్మిది గంటలకు కల్యాణ మహోత్సవం అంగరంగ వైభవంగా జరుగుతుంది. ఈ మేరకు స్వామి కల్యాణ మండపాన్ని విశేష పుష్ప అలంకరణలతో సిద్ధం చేశారు. రథోత్సవం అనంతరం ఎదుర్కోలు సన్నాహంతో నూతన వస్త్రాలు, సుగంధ ద్రవ్యాలు సమర్పించి మేళతాళాలతో స్వామి వారిని, అమ్మవారిని రథం పైనుంచి ప్రత్యేక పల్లకీలో ఆలయానికి తోడ్కొని వస్తారు. రాత్రి ఎనిమిది గంటల సమయంలో మంగళస్నానం నిర్వహించి కల్యాణ మహోత్సవాలకు సిద్ధం చేస్తారు. వైఖానస ఆగమశాస్త్రం ప్రకారం స్వామి కల్యాణం రాత్రి తొమ్మిది గంటలకు జరుగుతుంది.

కృష్ణంపాలెంలో ఉచిత వైద్యశిబిరం



వైద్యశిబిరాన్ని ప్రారంభిస్తున్న ప్రభాకరరావు

దేవరపల్లి, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): ఆరోగ్యమే మహాభాగ్యమని పీఎంపీల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు తోరాటి ప్రభాకరరావు అన్నారు. కృష్ణంపాలెంలోని ప్రాథమిక పాఠశాల వద్ద పీఎంపీల అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత వైద్యశిబిరాన్ని నిర్వహించారు. ఇందులో కొయ్యలగూడెంకు చెందిన ఆరోగ్య మల్టీస్పెషాలిటీ ఆసుపత్రి ఆధ్వర్యంలో వైద్యపరీక్షలు నిర్వహించి, పేదలకు మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా గోపాలపురం నియోజకవర్గ జనసేన ఇన్‌ఛార్జి సువర్ణరాజు మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతంలో పేదలకు మెరుగైన వైద్యం అందించేందుకు మెడికల్ క్యాంపులు ఏర్పాటు చేసి ఉచిత వైద్యపరీక్షలు నిర్వహిం చడం గొప్ప విషయమన్నారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ నాయుడు దుర్గాప్రసాద్, ఆరోగ్య ఆసుపత్రి వైద్యనిపుణులు డాక్టర్ కల్లూరి లక్ష్మణ్, డాక్టర్ పీ.నాగార్జున, డాక్టర్ భాగ్యలక్ష్మి, డాక్టర్ సతీష్, పీఎంపీల అసోసి యేషన్ నాయకులు బళ్ళా శ్రీనివాసరావు, దేవానందం, ఆకుల నాగేశ్వరరావు, సత్య భాస్కర్, తదితరులు పాల్గొన్నారు.

కోట సత్తెమ్మకు విశేషపూజలు



ప్రత్యేక అలంకరణలో అమ్మవారు

నిడదవోలు, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): తిమ్మరాజుపాలెంలో వేంచేసిన కోటసత్తెమ్మ వారికి ఆదివారం విశేషపూజలు నిర్వహించారు. ఉదయం సుప్రభాత సేవతో ప్రారంభమై ధూపహారతి, నిత్యార్చన, లలితా పారాయణం, సహస్రనామ కుంకుమ పూజలు జరిపారు. అనంతరం అమ్మవారికి క్షీర, మహానివేదన చేశారు. ప్రత్యేక పూలఅలంకరణలో అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు. ఆదివారం కావడంతో పలు జిల్లాల నుంచి భక్తులు తరలిరావడంతో ఆలయం కిటకిటలాడింది. ప్రత్యేక దర్శనం ద్వారా రూ.27,460, అన్నదాన విరాళాల ద్వారా రూ.2941, ప్రసాద విక్రయాల ద్వారా రూ.15,840, పూజా టికెట్లు, ఇతర టికెట్ల ద్వారా రూ.55,396, మొత్తం రూ.1,00,637 ఆదాయం లభించినట్టు దేవస్థానం సహాయ కమిషనర్, కార్యనిర్వహణాధికారి వి. హరి సూర్యప్రకాష్, ఫౌండర్ ఫ్యామిలీ మెంబర్ అండ్ చైర్మన్ దేవులపల్లి రవిశంకర్ తెలిపారు.

జనసేన పార్టీ సన్నాహక సభ సమావేశం

రాజమహేంద్రవరం రూరల్ మార్చి 9 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 14వ తేదీన కాకినాడ జిల్లా పిఠాపురం దరి చిత్రాడలో జరగనున్న జనసేన పార్టీ 12వ ఆవిర్భావ సభకు సంబంధించి సన్నాహక సమావేశాన్ని రూరల్ మండలం హుకుంపేటలోని పార్టీ కార్యాలయంలో ఆదివారం జరిగింది. మంత్రి కందుల దుర్గేష్ ఆదేశాల మేరకు నిర్వహించారు. చీరాల నియోజకవర్గ ఇన్‌చార్జి ఆళ్ల అనిల్ కుమార్ , పొన్నూరు ఇన్‌చార్జి పార్వతీ నాయుడు హాజరై రూరల్ నియోజకవర్గ నాయకులతో చర్చించారు. కార్యక్రమంలో పలువురు జనసేన పార్టీ నాయకులు పాల్గొన్నారు. అనంతరం సభ పోస్టర్‌ను ఆవిష్కరించారు.

టిప్పర్ ఢీ కొని యువకుడి మృతి

నిడదవోలు, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): నిడదవోలు పట్టణంలోని విద్యుత్‌శాఖ డివిజనల్ కార్యాలయం సమీపంలో ఆదివారం టిప్పర్ ఢీకొనడంతో ద్విచక్ర వాహనంపై వెళ్తున్న యువకుడు అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడు పందలపర్రు గ్రామానికి చెందిన సంకు నానిబాబు (19)గా గుర్తించారు. ఈయన తాపీమేస్త్రీగా పనిచేస్తూ తల్లి, చెల్లిని పోషిస్తున్నట్టు స్థానికులు చెప్పారు. పట్టణ ఎస్ఐ పరమహంస కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. వ్యాన్ డ్రైవర్ పోలీస్‌స్టేషన్‌లో లొంగిపోయినట్టు సమాచారం.

పెద్దేవంలో సీసీ రోడ్డు పనులు పూర్తి



పనులు పరిశీలిస్తున్న సర్పంచ్, ఉప సర్పంచ్

తాళ్లపూడి, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): పెద్దేవంలో 15వ ఆర్థిక సంఘం నిధులతో చేపట్టిన సీసీ రోడ్లు, డ్రైనేజీ పనులు పూర్తి చేసినట్టు గ్రామసర్పంచ్ తిగిరిపల్లి వెంకట్రావు, ఉపసర్పంచ్ తోట రామకృష్ణ తెలిపారు. దీంతో గ్రామప్రజలు ఆనందం వ్యక్తం చేశారు.

చికిత్స పొందుతూ ఒకరి మృతి

కొవ్వూరు, మార్చి 9 (ఆంధ్రజ్యోతి) : రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందినట్టు కొవ్వూరు రూరల్ ఎస్ఐ కె. శ్రీహరిరావు తెలిపారు. పోలీసులు అందించిన వివరాల ప్రకారం కొవ్వూరు నుంచి దేవరపల్లి వైపు వెళ్లే ఎన్‌హెచ్ 16లో కొవ్వూరు మండలం కాపవరం ఫైఓవర్ వద్ద ఈనెల 5వ తేదీన యూనికార్న్ బైక్ ఢీ కొట్టడంతో ఇద్దరికి గాయాలయ్యాయి. వారిని చికిత్స నిమిత్తం రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ ప్రమాదంలో గాయపడిన వ్యక్తుల్లో గుర్తుతెలియని వ్యక్తి చికిత్స పొందుతూ ఈనెల 8వ తేదీ రాత్రి మృతిచెందాడు. కాపవరం వీఆర్వో కౌరు వెంకటలక్ష్మి అందించిన ఫిర్యాదుపై కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ తెలిపారు. మృతుడు భిక్షాటన చేస్తున్నట్టు పోలీసులు భావిస్తున్నారు. ఆచూకి తెలిసినవారు కొవ్వూరు రూరల్ పోలీస్‌స్టేషన్ 94407 96623 నెంబర్‌కు సమాచారమివ్వాలన్నారు.

ఆటోడ్రైవర్‌కు తీవ్రగాయాలు

కొవ్వూరు, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): ఆగివున్న కారును ఢీకొన్న ప్రమాదంలో ఆటో డ్రైవర్‌కు తీవ్రగాయాలయ్యాయి. స్థానికులు అందించిన వివరాల ప్రకారం... కోరుకొండ మండలం కాపవరం నుంచి కొవ్వూరు మండలం కాపవరం గ్రామానికి కిరాయికి వస్తున్న ఆటోడ్రైవర్ గుగ్గిలం వంశీ స్థానిక ఏషియన్ పెయింట్స్ గోడౌన్ సమీపంలో హైవేపై ఆగి ఉన్న కారును వెనుక నుంచి వచ్చి ఢీకొట్టాడు. దీంతో డ్రైవర్ వంశీకి నడుము, కాళ్లు, చేతులకు తీవ్ర గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం క్షతగాత్రున్ని హైవే పెట్రోలింగ్ సిబ్బంది 108 అంబులెన్స్‌లో రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.